



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 203 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : ఒంగోలు | ఆదివారం 29 మార్చి 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :203 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : ONGOLE | SUN 29 MARCH 2026 | PRICE :

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## అసెంబ్లీలో "జై అమరావతి" నినాదాలు చేసిన మంత్రి నారా లోకేశ్

- అమరావతికి చట్టబద్ధత కల్పించే తీర్మానానికి మద్దతుగా మాట్లాడిన లోకేశ్
- రాజధానిపై జగన్ తన వైఖరి స్పష్టం చేయాలని డిమాండ్
- మూడు ముక్కలాట ఆడి ప్రజలను మోసం చేశారని విమర్శ
- రాష్ట్ర ప్రజలకు, రైతులకు జగన్ క్షమాపణ చెప్పాలని వ్యాఖ్య
- ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని తమ ప్రభుత్వ విధానమని స్పష్టీకరణ


- మిగతా 2లో

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ శాసనసభలో 'జై అమరావతి' నినాదాలు మార్మోగాయి. రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే తీర్మానంపై జరిగిన చర్చలో ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన ప్రసంగం మధ్యలో ఈ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాజధానిగా అమరావతే ఉంటుందని అబద్ధం చెప్పి ముఖ్యమంత్రి అయ్యాక జగన్ మూడు ముక్కలాట ఆడారని ఆయన ఆరోపించారు. రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించిన కీలకమైన అంశంపై సభలో చర్చ జరుగుతుంటే జగన్ బెంగళూరులో

## అమరావతి నగరం ఆంధ్రప్రదేశ్ ఆత్మ...

# ఎవరూ టచ్ చేయలేరు

- ఏపీ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించాలని అసెంబ్లీ తీర్మానం
- విభజన చట్టంలో 'ఎట్ అమరావతి' అని చేర్చాలని కేంద్రాన్ని కోరిన సభ
- రాజధానిపై జగన్‌ది ఊసరవెల్లి రాజకీయమని సీఎం చంద్రబాబు విమర్శ
- భూములిచ్చిన రైతులకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానన్న సీఎం
- 2028 నాటికి అమరావతి నిర్మాణం పూర్తి చేస్తామని స్పష్టం చేసిన ప్రభుత్వం



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌కు ఒకటే రాజధాని... అది అమరావతేనని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అమరావతి అజేయం, అద్భుతం, అజరామరమని అభివర్ణించారు. అమరావతిని ఎవరూ టచ్ చేయలేరని పునరుద్ఘాటించారు. శాశ్వత రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కేంద్రాన్ని కోరుతూ శుక్రవారం శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, అమరావతి ఆంధ్రప్రదేశ్ ఆత్మ అని, రాష్ట్ర భవిష్యత్తుకు పునాది అని అభివర్ణించారు.

**అమరావతికి చట్టబద్ధత**

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014లోని సెక్షన్-5(2)ను సవరించాలని ఈ తీర్మానం ద్వారా కేంద్రాన్ని కోరారు. చట్టంలో రాజధానిని పేర్కొనేచోట 'ఎట్ అమరావతి' అనే పదాన్ని చేర్చాలని ప్రతిపాదించారు. సీఆర్డీఏ చట్టం ప్రకారం నోటిఫై చేసిన ప్రాంతాలన్నిటికీ రాజధాని పరిధి వర్తింపజేసేలా చట్ట సవరణ చేయాలని కోరారు. శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించిన ఈ తీర్మానాన్ని స్పీకర్ అయ్యన్నపాత్రుడు.. రాజ్యసభ ఛైర్మన్, లోక్‌సభ స్పీకర్‌తో పాటు కేంద్ర హోంమంత్రికి పంపించారు. ఈ తీర్మానం ప్రతుల్ని కేంద్ర హోంశాఖ కార్యదర్శికి, ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కూడా పంపడం ద్వారా అధికారిక ప్రక్రియను పూర్తి చేశారు.

**రైతుల త్యాగం.. జగన్‌పై విమర్శలు**

రాష్ట్ర భవిష్యత్తు కోసం 34 వేల ఎకరాల భూములను త్యాగం చేసిన రైతులకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు సభలో భావోద్వేగంగా ప్రసంగించారు. రైతులు ఇచ్చింది కేవలం భూమి కాదని, రాష్ట్ర భవిష్యత్తును ఇచ్చారని కొనియాడారు. ఇదే సమయంలో, గత ప్రభుత్వంపై, ప్రతిపక్ష నేత జగన్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అమరావతికి బేషరతుగా మద్దతు ఇస్తున్నానని చెప్పిన వ్యక్తి, అధికారంలోకి వచ్చాక రోజుకో మాటతో ఊసరవెల్లి రాజకీయాలు చేశారు. రాజ్యాంగంలో రాజధాని అనే పదం లేదని అంటారు. వీళ్లకు ఏదైనా ప్రత్యేక రాజ్యాంగం ఉందా? వీళ్లు రాజారెడ్డి రాజ్యాంగాన్ని అనుసరిస్తారు, దేశం అనుసరించేది అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని" అని చంద్రబాబు ఎద్దేవా చేశారు. అమరావతికి రుణాలు రాకుండా ప్రపంచ బ్యాంకుకు ఈ-మెయిల్స్ పంపడం వంటి కుట్రలకు పాల్పడ్డారని ఆరోపించారు. చారిత్రక నేపథ్యం.. కోల్పోయిన రాజధానులు తెలుగువారి చారిత్రక వైభవాన్ని గుర్తుచేస్తూ, కృష్ణానది తీరంలోని అమరావతిని రాజధానిగా చేసుకుని శాతవాహనులు పాలించారని చంద్రబాబు

- మిగతా 2లో




### నెల రోజుల అనంతరం, ఇరాన్‌కు మద్దతుగా ఇజ్రాయెల్‌పైకి హూతీల క్షిపణి దాడి

- ఇజ్రాయెల్‌పై దాడి చేసిన యెమెన్ హూతీ మిలిటెంట్లు
- నెల రోజుల యుద్ధం అనంతరం మొదటిసారి కదనరంలోకి హూతీలు
- క్షిపణి దాడిని అడ్డుకున్నట్లు ప్రకటించిన ఇజ్రాయెల్

- మిగతా 2లో

### అసెంబ్లీ వేదికగా పవన్ కల్యాణ్ కు థాంక్స్ చెప్పిన చంద్రబాబు..

- అమరావతికి చట్టబద్ధత కల్పించే తీర్మానంపై అసెంబ్లీలో చర్చ
- 2014లో పవన్ బేషరతుగా మద్దతివ్వడం, 2024 కూటమి ఏర్పాటును గుర్తు చేసుకున్న చంద్రబాబు
- 94 శాతం స్ట్రైక్ రేట్‌తో కూటమికి వచ్చిన తీర్పు చారిత్రకమన్న సీఎం
- మూడు రాజధానుల పేరుతో వైసీపీ రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందని విమర్శలు
- అమరావతి పనులను పునఃప్రారంభించామని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతి చట్టబద్ధతను పునరుద్ధరించే తీర్మానంపై శాసనసభలో జరిగిన చర్చలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ప్రసంగం చేశారు.

- మిగతా 2లో



### ఆ రోజు నా చేతిలో తుపాకీ ఉంటే కాల్చిపడేయాలనిపించింది

- శాసన మండలిలో చంద్రబాబుకు జరిగిన అవమానాలపై అచ్చెన్నాయుడు తీవ్ర భావోద్వేగం
- తుపాకీ ఉంటే కాల్చేయాలనిపించేంత దారుణంగా తిట్టారని వ్యాఖ్య
- 2019లో ప్రజలు తప్పు చేశారని, లక్ష కోట్లు దోచిన దొంగకు ఓటేశారని విమర్శ
- అమరావతికి చట్టబద్ధత కల్పించడానికే నేటి తీర్మానం అని వెల్లడి
- గత ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టిందని ఆరోపణ

- మిగతా 2లో




### జగన్ హయాంలోనే అమరావతిలో రోడ్ల నిర్మాణం జరిగింది

- అమరావతిని చంద్రబాబు అప్పులకుప్పలా మార్చారన్న పేర్ని నాని
- అమరావతికి చట్టబద్ధత తీర్మానం ఒక డ్రామా అని విమర్శ
- మండలి ఆమోదం లేకుండా చట్టబద్ధత ఎలా వస్తుందని ప్రశ్న?

పెన్ పవర్ డెస్క్:రాజధాని అమరావతిని చంద్రబాబు అప్పులకుప్పగా మార్చారని, కాంట్రాక్టర్ల దోపిడీ కోసం దీనిని ఒక 'ఏటీఎమ్'లా వాడుకుంటున్నారని మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నాని మండిపడ్డారు. ఇప్పటివరకు ఖర్చు చేసిన రూ. 21 వేల కోట్లపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన

- మిగతా 2లో




### హర్మూజ్ జలసంధి దాటిన రెండు భారత ఎల్పీజీ నౌకలు

- బీడబ్ల్యూ ఈఎల్ఎం, బీడబ్ల్యూ టీవైఆర్‌లు హర్మూజ్ దాటినట్లు వెల్లడి
- అంతర్జాతీయ జలాల్లోకి రెండు నౌకలు ప్రవేశించాయన్న భారత వర్గాలు
- 90,000 మెట్రిక్ టన్నులకు పైగా ఎల్పీజీ గ్యాస్ రాక

పెన్ పవర్ డెస్క్:భారతీయ జెండాలు కలిగిన రెండు ఎల్పీజీ కంటైనర్లు బీడబ్ల్యూ ఈఎల్ఎం, బీడబ్ల్యూ టీవైఆర్‌లు హర్మూజ్ జలసంధిని దాటాయి. శుక్రవారం నాడు దుబాయ్ రస్అల్‌ఖైమాకు ఉత్తరాన లంగర్ వేసిన ఐదు నౌకలలో

- మిగతా 2లో

## మీరు అలా చేయాల్సిందే

### గల్ఫ్ దేశాలకు ఇరాన్ అధ్యక్షుడి హెచ్చరిక

- అభివృద్ధి, శాంతి కావాలంటే తాము చెప్పినట్లు చేయాలన్న ఇరాన్ అధ్యక్షుడు
- అమెరికా, ఇజ్రాయెల్‌లు మీ గగనతలాలను వినియోగించుకోకుండా చూడాలని హెచ్చరిక
- మౌలిక సదుపాయాలు, ఆర్థిక కేంద్రాలు లక్ష్యంగా చేసుకుంటే ప్రతీకార దాడులు తప్పవని హెచ్చరిక

- మిగతా 2లో





### నోయిడా వెళితే ప్రధాని పదవి పోతుందని నాతో చెప్పారు

- పదవులు కోల్పోతామనే భయంతో నాయకులు నోయిడాకు రావడం మానేశారన్న ప్రధాని
- ఎస్పీ అధికారంలో ఉన్నప్పుడు నోయిడాకు రావాలనుకుంటే నాటి సీఎం వద్దని చెప్పారన్న మోదీ
- "ఈ మధ్యనే ప్రధాని అయ్యారు, నోయిడాకు వెళ్లవద్దు" అని సూచించారని వెల్లడి
- ప్రజల ఆశీర్వాదం కోసం వెళతానని ఆ ముఖ్యమంత్రికి తాను స్పష్టం చేశానన్న మోదీ

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# కోరికలు తీర్చే పవిత్ర ఏకాదశి

హిందూ సంప్రదాయంలో ఏకాదశి వ్రతాలకు అత్యంత విశిష్ట స్థానం ఉంది. ప్రతి నెలలో వచ్చే రెండు ఏకాదశుల్లో చైత్రమాసం శుక్లపక్షంలో వచ్చే కామద ఏకాదశి ప్రత్యేకమైనది. "కామద" అన్న పదానికి అర్థం ? "కోరికలు నెరవేర్చే". అందుకే ఈ ఏకాదశిని కోరికల పరిపూరణకు కారణమయ్యే పవిత్ర దినంగా భావిస్తారు. ఈ ఏకాదశికి మరొక పేరు 'దమన ఏకాదశి'. ఇది మనిషి లోపాలను ? కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలను ? దమన చేసే శక్తిని కలిగి ఉంటుంది. ఈ వ్రతాన్ని ఆచరించడం వలన శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శుభాలు సిద్ధిస్తాయని పురాణాలు పేర్కొంటున్నాయి. వరాహ పురాణం ప్రకారం శ్రీకృష్ణుడు ధర్మరాజుకు ఈ వ్రత మహాత్మ్యాన్ని వివరించాడు. వశిష్ఠ మహర్షి దిలీప మహారాజుకు ఈ వ్రత విశిష్టతను వివరించాడని కూడా పురాణ ప్రస్తావన ఉంది. ఈ వ్రతం ద్వారా సంతాన లభ్యం, వైవాహిక జీవిత సౌఖ్యం, సౌభాగ్య స్థిరత్వం లభిస్తాయని నమ్మకం. పూర్వం రత్నపుర అనే రాజ్యంలో పుండరీకుడు అనే రాజు పాలన సాగించేవాడు. ఆయన రాజసభలో గంధర్వులు, కిన్నెరులు, కింపురుషులు, అప్సరసలు కళలతో వినోదాన్ని అందించేవారు. ఒకరోజు, లలితకాంత అనే గంధర్వుడు తన భార్య లలితను గురించిన ఆలోచనలతో తక్కువ నిబద్ధతతో కళా ప్రదర్శన ఇవ్వడం గమనించిన రాజు, కోపంతో అతనిని రాక్షసుడిగా కమ్మని శపించాడు. తన స్వరూపం కోల్పోయిన లలిత కాంతుని భార్య లలిత, భర్తను రక్షించేందుకు శృంగి మహర్షిని ఆశ్రయించింది. మహర్షి ఆమెకు కామదా ఏకాదశి వ్రతం ఆచరించమని ఉపదేశించాడు. లలిత భక్తిశ్రద్ధలతో వ్రతం ఆచరించడంతో భర్తకు శాప విమోచనం లభించి పూర్వరూపాన్ని పొందాడు. వీరిద్దరూ మోక్షాన్ని పొందినట్లు పురాణం చెబుతుంది. దశమి రోజున సాయంత్రం తర్వాత తిండి తీసుకోకుండా ఉపవాసానికి సిద్ధమవ్వాలి. సాత్విక ఆహారం తీసుకోవాలి. ఏకాదశి రోజున సూర్యోదయానికి ముందే లేచి శుద్ధంగా స్నానం చేయాలి. పూజా గృహంలో విష్ణు విగ్రహాన్ని అలంకరించి, దీపం, పుష్పాలు, తులసీదళాలు సమర్పించాలి. విష్ణు సహస్రనామం, అష్టోత్తర శతనామావళి పారాయణ చేయాలి. ఉపవాసంతో, జాగరణతో ఈ దినాన్ని గడపాలి. ద్వాదశి రోజున బ్రాహ్మణులకు భోజనం పెట్టి, దానధర్మాలు చేసి, ఆ తరువాతే స్వయంగా భోజనం చేయాలి. తద్వారా పూర్వకర్మల వల్ల ఏర్పడిన పాపాలు తొలగిపోతాయి. కోరికలు నెరవేరుతాయి. సంతాన యోగం కలుగుతుంది. స్త్రీలకు సౌభాగ్యం నిలుస్తుంది. వైవాహిక సమస్యలు తొలగిపోతాయి. మోక్ష మార్గం వైపు అడుగులు వేయగలుగుతారు. కామద ఏకాదశి ఒక పరమ పవిత్రమైన వ్రతం. భక్తి, శ్రద్ధ, నియమ నిష్టలతో ఈ వ్రతాన్ని ఆచరించే వారికి భగవంతుని అనుగ్రహం లభిస్తుంది. దురాశలు తొలగిపోయి, ఆత్మ శుద్ధి కలుగుతుంది. శాస్త్రాలు, పురాణాలు చెప్పిన విధంగా ఈ వ్రతాన్ని ఆచరిస్తే సకల శుభాలు, కోరికల పరిపూరణ జరుగుతాయి.

# హర్మూజ్ జలసంధి దాటిన రెండు భారత ఎల్పీజీ నౌకలు

- మొదటి పేజీ తరువాయి

ఇవి కూడా ఉన్నాయి. ఈఎల్ఎం నౌక హెచ్‌పీసీఎల్‌ది కాగా, టీవైఆర్ నౌక బీపీసీఎల్‌కు చెందినది. భారత్ సహా మిత్రులైన ఐదు దేశాల నౌకల కోసం హర్మూజ్ జలసంధిని తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఎల్పీజీని తీసుకువస్తున్న రెండు నౌకలు సురక్షితంగా హర్మూజ్‌ను దాటినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ రెండు నౌకల్లో 90,000 మెట్రిక్ టన్నులకు పైగా ఎల్పీజీ గ్యాస్ వస్తోంది. ఈ రెండు నౌకలు హర్మూజ్‌ను దాటి అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మరికొన్ని భారతీయ ట్యాంకర్లు యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్ సమీపంలోని జలాల్లో ఇరాన్ అనుమతి కోసం వేచి చూస్తున్నాయి. కాగా, 47,000 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ గ్యాస్‌తో కూడిన జగ్ వసంత్ ట్యాంకర్ నౌక గుజరాత్‌లోని వదినార్ పోర్టుకు చేరుకుంది.

# అమరావతి నగరం ఆంధ్రప్రదేశ్ ఆత్మ... ఎవరూ టచ్ చేయలేరు

- మొదటి పేజీ తరువాయి

అన్నారు. బ్రిటిష్ మ్యూజియంలో సైతం 'అమరావతి గ్యాలరీ' మన ఘన చరిత్రకు నిదర్శనమని చెప్పారు.

బ్రిటిష్ పాలనలో మద్రాస్ ప్రెసిడెన్సీలో తెలుగు ప్రాభవాన్ని కోల్పోయామని, పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగంతో కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందని గుర్తుచేశారు. ఆ తర్వాత హైదరాబాద్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడిందని, ఇప్పుడు విభజనతో దాన్ని కూడా కోల్పోయి అమరావతిని నిర్మించుకుంటున్నామని వివరించారు. రాజధానులు కోల్పోతూ వివక్ష, అవమానాలు భరిస్తూ వచ్చామని ఆవేదన వ్యక్తం చేశారు.

**గత ఐదేళ్ల విధ్వంసం**

2019లో ఒక్క ఛాన్స్‌తో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం.. ప్రజావేదికను కూల్చివేసి విధ్వంస పాలనకు నాంది పలికిందని చంద్రబాబు ఆరోపించారు. అమరావతిని నాశనం చేసి రాష్ట్రాన్ని 30 ఏళ్లు వెనక్కి నెట్టారని మండిపడ్డారు.

రాజధాని కోసం పోరాడిన రైతులపై లాఠీలతో కొట్టి, బూట్లతో తన్ని, అక్రమ కేసులు పెట్టి 'కీచకపర్వం' సాగించారని దుయ్యబట్టారు. మూడు రాజధానుల బిల్లును శాసన మండలిలో అడ్డదారిలో ఆమోదింపజేయాలని చూసినా, న్యాయస్థానాలు అడ్డుకున్నాయని గుర్తుచేశారు. ఈ తుగ్లక్ నిర్ణయాల వల్ల రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా పోయాయని విమర్శించారు.

**హైదరాబాద్ స్ఫూర్తి.. అమరావతి భవిష్యత్**

తాను విజన్-2020తో సైబరాబాద్‌ను ఇటుక ఇటుక పేర్చి నిర్మించానని, దాని ఫలితంగానే హైదరాబాద్ నగరం దేశంలోనే 'మోస్ట్ లివబుల్ సిటీ'గా నిలిచి, రూ.1.05 లక్షల కోట్ల ఆదాయాన్ని సమకూరుస్తోందని చంద్రబాబు తెలిపారు. అదే స్ఫూర్తితో అమరావతిని కూడా దేశం గర్వించేలా 'బ్లూ అండ్ గ్రీన్ సిటీ'గా, భవిష్యత్ నగరంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.

రాజధాని ఒకటే అయినా, అభివృద్ధిని రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు విస్తరిస్తామని, విశాఖ, అమరావతి, తిరుపతి రీజియన్లను సమానంగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. 2028 నాటికి పనులన్నీ పూర్తి చేసి అమరావతికి ఒక సంపూర్ణ రూపాన్ని తీసుకువస్తామని చంద్రబాబు శాసనసభకు హామీ ఇచ్చారు.

# మీరు అలా చేయాల్సిందే

మీకు అభివృద్ధి, భద్రత, శాంతి కావాలనుకుంటే, అమెరికా, ఇజ్రాయెల్ దేశాలను మీ భూభాగాల మీద నుండి దాడులు చేయకుండా నిరోధించాలని గల్ఫ్ దేశాలకు ఇరాన్ హెచ్చరిక జారీ చేసింది. ఈ మేరకు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ తమ పొరుగు దేశాలకు హెచ్చరికలు జారీ చేశారు. గల్ఫ్ దేశాలలోని స్థావరాల నుంచి అమెరికా ఇరాన్‌పై దాడులు చేస్తోన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు గల్ఫ్ దేశాలకు హెచ్చరిక జారీ చేశారు. గల్ఫ్ దేశాలపై దాడులు ఆగాలన్నా, శాంతి, అభివృద్ధి నెలకొనాలన్నా తాము చెప్పినట్లు వినాలని స్పష్టం చేశారు. ఆయా దేశాల గగనతలాలను వినియోగించుకుని శత్రువులు దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గగనతలాలను వినియోగించుకోవడానికి అమెరికా, ఇజ్రాయెల్‌లకు అనుమతి ఇవ్వవద్దని షరతు విధించారు. బహ్రెయిన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్, జోర్డాన్, ఇతర పశ్చిమాసియా దేశాలను ఇరాన్ అధ్యక్షుడు హెచ్చరించారు. ఇరాన్ ఎప్పుడూ ముందుగా దాడులు చేయదని స్పష్టంగా చెప్పామని అన్నారు. కానీ తమ మౌలిక సదుపాయాలు, ఆర్థిక కేంద్రాలు, అణుకేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటే ప్రతీకారం తప్పదని పలుమార్లు హెచ్చరించామని గుర్తు చేశారు. శత్రుస్థావరాలు భూస్థాపితమయ్యే వరకు దాడులు చేస్తామని స్పష్టం చేశారు. శత్రువులకు సహకరించిన వారిని కూడా వదిలేది లేదన్నారు.

# నెల రోజుల అనంతరం, ఇరాన్‌కు మద్దతుగా ఇజ్రాయెల్‌పైకి హూతీల క్షిపణి దాడి

పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైన నెల రోజుల తర్వాత, ఇరాన్‌కు మద్దతుగా ఉండే యెమెన్ హూతీ మిలిటెంట్లు ఇజ్రాయెల్‌పై మొదటిసారి దాడి చేశారు. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం నేపథ్యంలో ప్రస్తుతం ఓ వైపు దాడులు, మరోవైపు కాల్పుల విరమణకు సంప్రదింపులు జరుగుతున్న సమయంలో ఈ కీలకపరిణామం చోటుచేసుకుంది. హూతీలు మొదటిసారి కదనరంగంలోకి దిగారు. ఇజ్రాయెల్‌లోని సైనిక స్థావరాలు లక్ష్యంగా వారు క్షిపణి దాడులు నిర్వహించారు. ఇజ్రాయెల్‌పై దాడులు చేసినట్లు హూతీల ప్రతినిధి యాహ్యా సారె ధృవీకరించారు. యెమెన్ నుంచి ప్రయోగించిన క్షిపణిని గుర్తించి, దాడిని అడ్డుకున్నామని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. తమ గగనతల రక్షణ వ్యవస్థలు ఈ క్షిపణిని అడ్డుకున్నాయని వెల్లడించింది. హూతీల దాడితో ప్రాణ, ఆస్తి నష్టం కలిగినట్లు తెలియరాలేదు.

యుద్ధంలోకి హూతీలు రావడం చమురు మార్కెట్‌కు ఆందోళన కలిగించే అంశం. గాజాపై ఇజ్రాయెల్ దాడులు చేసిన సమయంలో హూతీలు క్రియాశీలకంగా వ్యవహరించారు. పాలస్తీనియన్లకు మద్దతుగా ఎర్ర సముద్రం, గల్ఫ్ ఆఫ్ ఏడెన్ మార్గంలో వెళ్లే నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేశారు. అయితే నెల రోజులుగా అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం జరుగుతున్నప్పటికీ హూతీలు కనిపించలేదు. తాజా దాడి చర్చకు దారితీసింది.

# ఆ రోజు నా చేతిలో తుపాకీ ఉంటే కాల్చిపడేయాలనిపించింది

గత ప్రభుత్వ హయాంలో సభలో చంద్రబాబుకు, తమకు జరిగిన అవమానాలు చూశాక.. తన దగ్గర తుపాకీ ఉంటే కాల్చిపడేసేవాడిని అనిపించేంత ఆవేదన, కోపం కలిగాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతిని ఖరారు చేస్తూ శాసనసభలో ప్రవేశపెట్టిన తీర్మానంపై జరిగిన చర్చలో ఆయన ప్రసంగించారు. గత వైసీపీ ప్రభుత్వంలో మూడు రాజధానుల బిల్లును మండలిలో అడ్డుకున్న సమయంలో చోటుచేసుకున్న పరిణామాలను గుర్తుచేసుకుంటూ ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆ తిట్లు పడటానికే రాజకీయాల్లోకి వచ్చామా అని ఆ రోజు ఆవేదన చెందానని అన్నారు.

**గన్నుంటే కాల్చేయాలనిపించింది**

గత ప్రభుత్వంలో మూడు రాజధానుల బిల్లును శాసనమండలిలో ప్రవేశపెట్టిన రోజు జరిగిన ఘటనలను అచ్చెన్నాయుడు పూసగుచ్చినట్టు వివరించారు. "ఆ రోజు చంద్రబాబు గారిని, మమ్మల్ని అనరాని మాటలు అన్నారు. ఆ మాటలు వింటే నాలాంటోడికైతే గన్ను ఉంటే కాల్చేయాలి అనిపిస్తుంది. ఇంత దారుణమా? ఈ తిట్లు తినడానికేనా మనం రాజకీయాల్లో ఉన్నది? అనిపించింది. అయినా సరే, చంద్రబాబు గారు ఎంతో ఓపికతో నిలబడ్డారు. ఆయన ఓపికకు జోహార్లు. ఇది మన బాధ్యత అని మాకు ధైర్యం చెప్పారు" అని అచ్చెన్నాయుడు అన్నారు.

**ప్రజాస్వామ్యానికి చీకటి రోజు**

మూడు రాజధానుల బిల్లును శాసన మండలిలో ప్రవేశపెట్టిన 2020, జనవరి 21వ తేదీని ప్రజాస్వామ్యానికి చీకటి రోజని అచ్చెన్నాయుడు అభివర్ణించారు. "శాసన మండలిలో మాకు బలం ఉన్నా, వైఎస్సార్సీపీకి కేవలం 8 మంది సభ్యులే ఉన్నా.. బిల్లును అడ్డగోలుగా పాస్ చేయాలని చూశారు. మంత్రులు, ఎమ్మెల్యేలందరూ మండలిలోకి వచ్చేశారు. లైట్లు ఆపేశారు, టీవీ ప్రసారాలు నిలిపేశారు. చైర్మన్ షరీఫ్ గారి ఛాంబర్‌ను విజయసాయి రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి వంటి వారు చుట్టుముట్టి తీవ్ర ఒత్తిడి తెచ్చారు. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ చైర్మన్ గారు ధైర్యంగా నిలబడి బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపి రాష్ట్రాన్ని బతికించారు" అని ఆయన వివరించారు.

**2019లో ప్రజలు తప్పు చేశారు**

2019 ఎన్నికల్లో ప్రజలు చారిత్రక తప్పిదం చేశారని అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. "2014-19 మధ్య చంద్రబాబు పాలన ఈ రాష్ట్రానికి ఒక స్వర్ణయుగం. అన్ని జిల్లాలను అభివృద్ధి చేస్తూ, సంక్షేమాన్ని అందిస్తూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లాం. అయినా ప్రజలు మమ్మల్ని ఎందుకు ఓడించారో అర్థం కాలేదు. ఎవరో కొత్తగా ఆకాశం నుంచి దిగివచ్చి పార్టీ పెడితే నమ్మి ఓటేస్తే ఫర్వాలేదు. కానీ తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని లక్ష కోట్లు దోచుకుని, 16 నెలలు జైల్లో ఉన్న ఒక దొంగకు ఓటు వేశారనేదే నా బాధ" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**మూడు రాజధానుల పేరిట చిచ్చు**

గత ముఖ్యమంత్రి జగన్ మూడు రాజధానుల పేరుతో ప్రాంతాల మధ్య, కులాల మధ్య చిచ్చు పెట్టారని అచ్చెన్నాయుడు ఆరోపించారు. "విశాఖపట్నాన్ని రాజధాని చేస్తామని చెప్పి ఐదేళ్లలో ఏం ఉద్ధరించారు? ఒక్క ఇటుక కూడా వేశారా? కేవలం ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలతో ఆడుకున్నారు. మేము అమరావతే రాజధాని అని ఎన్నికలకు వెళ్లాం, ఆ మాటకు కట్టుబడి ఉన్నాం. రాజధాని పేరుతో అమరావతి రైతులను, రాష్ట్రాన్ని నాశనం చేశారు. ఒక శిల్పిలా చంద్రబాబు గారు రాజధానిని చెక్కుతుంటే.. ఒక దుర్మార్గుడు వచ్చి సర్వనాశనం చేశాడు" అని ఆయన విమర్శించారు.

**అమరావతికి చట్టబద్ధత.. ప్రజలకు విజ్ఞప్తి**

అమరావతి రాజధాని నిర్మాణానికి చంద్రబాబు గారు కారకుడు, కర్త, క్రియ అని అచ్చెన్నాయుడు అన్నారు. "భవిష్యత్తులో మళ్లీ ఎవరైనా పిచ్చోడి చేతికి రాయి దొరికినట్టు, రాజధానిని మార్చాలని ప్రయత్నించకూడదనే ఉద్దేశంతోనే ఈరోజు ఈ తీర్మానం చేస్తున్నాం. దీనికి చట్టబద్ధత కల్పించి కేంద్రానికి పంపుతున్నాం. ప్రజలారా.. మళ్లీ వైకుంఠపాళి ఆట ఆడొద్దు. ప్రలోభాలకు లొంగి మళ్లీ తప్పు చేస్తే ఈ రాష్ట్రాన్ని ఎవ్వరూ బాగుచేయలేరు. మీ భవిష్యత్తు కోసం పనిచేస్తున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్, ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి" అని ఆయన ప్రజలకు చేతులు జోడించి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నట్లు తెలిపారు.

# జగన్ హయాంలోనే అమరావతిలో రోడ్ల నిర్మాణం జరిగింది

- మొదటి పేజీ తరువాయి

చట్టబద్ధత తీర్మానం కేవలం ఒక 'డ్రామా' అని, శాసనమండలి ఆమోదం లేకుండా కేవలం అసెంబ్లీ తీర్మానంతో చట్టబద్ధత ఎలా వస్తుందని ఆయన ప్రశ్నించారు. కూటమి నేతలు కేవలం జగన్‌ను తిట్టడానికే సమయాన్ని వృథా చేశారని ఆరోపించారు.

నిజానికి జగన్ హయాంలోనే అమరావతిలో రోడ్ల నిర్మాణం జరిగిందని, ఆయనకు రాజధానిపై కోపం ఉంటే తాడేపల్లిలో ఇల్లు ఎందుకు కట్టుకుంటారని నాని నిలదీశారు. అమరావతిలో పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలను రద్దు చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం రాజధానిపైనే కాకుండా, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, కడప స్టీల్ ప్లాంట్, విశాఖ ఉక్కుకు సొంత గనుల కేటాయింపు వంటి అంశాలపై అసెంబ్లీలో తీర్మానాలు చేయాలని కూటమి ప్రభుత్వానికి ఆయన సవాల్ విసిరారు. అప్పుడే ప్రభుత్వానికి రాష్ట్రంపై చిత్తశుద్ధి ఉందని నమ్ముతామని స్పష్టం చేశారు.

# నోయిడా వెళితే ప్రధాని పదవి పోతుందని నాతో చెప్పారు

సమాజ్‌వాది పార్టీ నేతలు మూఢనమ్మకాలు, పిరికితనంతో నోయిడాను గాలికి వదిలేశారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. గతంలో ఉత్తరప్రదేశ్‌లో అధికారంలో ఉన్నవారు తమ పదవులను కోల్పోతామనే భయంతో నోయిడాకు రావడమే మానేశారని ఆరోపించారు. సమాజ్‌వాది పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తాను ఇక్కడకు రావాలని అనుకున్నానని, ఈ నిర్ణయంతో నాటి ముఖ్యమంత్రి ఆందోళనకు గురయ్యారని అన్నారు. "మోదీ గారూ, నోయిడాకు వెళ్లవద్దు, మీరు ఈ మధ్యనే ప్రధాని అయ్యారు" అని ఆయన తనను హెచ్చరించారని చెప్పారు. నోయిడాకు ఆయన రాకపోగా, తనను కూడా రావొద్దని సూచించారని తెలిపారు. తాను మాత్రం కచ్చితంగా వెళతానని ఆ ముఖ్యమంత్రికి స్పష్టంగా చెప్పానని తెలిపారు. నోయిడా ప్రజల ఆశీర్వాదం కోసం వెళతానని, అది సుదీర్ఘకాలం దేశానికి సేవ చేసే అవకాశాన్ని ఇస్తుందని భావిస్తున్నానని ఆయనతో చెప్పినట్లు వెల్లడించారు. ఒకప్పుడు రాజకీయ నాయకులు ఈ నగరాన్ని వదిలేశారని, కానీ ఇప్పుడు ప్రపంచస్థాయి నేతలను ఆహ్వానించేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. ఈ నగరం ఈరోజు దేశానికి గర్వకారణంగా నిలిచిందని వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్నవారు నోయిడాలో పర్యటిస్తే వారికి అపశకునంగా మారుతుందనే నమ్మకం చాలాకాలంగా ప్రచారంలో ఉంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ పై వ్యాఖ్యలు చేశారు. 1988 నుంచి ఈ నగరంలో పర్యటించిన పలువురు ముఖ్యమంత్రులు ఆ తర్వాత వివిధ కారణాలతో పదవులకు దూరమయ్యారు. దీనితో నోయిడాకు వెళ్లడానికి రాజకీయ ప్రముఖులు ఆసక్తి కనబరచరు. అయితే యోగి ఆదిత్యనాథ్ తాను ముఖ్యమంత్రి అయ్యాక పలుమార్లు నోయిడాలో పర్యటించారు.

# అసెంబ్లీలో "జై అమరావతి" నినాదాలు చేసిన మంత్రి నారా లోకేశ్

- మొదటి పేజీ తరువాయి

ఉండటాన్ని లోకేశ్ తప్పుబట్టారు. ఇది వ్యక్తిగత విషయం కాదని, ఐదు కోట్ల ఆంధ్రుల భవిష్యత్తుకు సంబంధించినదని అన్నారు.ంగత ప్రభుత్వ హయాంలో అమరావతి రైతులు చేసిన ఆందోళనలకు సంబంధించిన ఫొటోలను లోకేశ్ సభలో ప్రదర్శించారు. ప్రజలను, రైతులను మోసం చేసినందుకు జగన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. 'ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ' తమ ప్రభుత్వ విధానమని లోకేశ్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. అమరావతి రాజధాని తీర్మానానికి తాను సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు స్పష్టం చేశారు.

# అసెంబ్లీ వేదికగా పవన్ కల్యాణ్ కు థాంక్స్ చెప్పిన చంద్రబాబు..

- మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఆయన మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం పవన్ కల్యాణ్ పోషించిన పాత్రను, ఆయన అందించిన మద్దతును ఎప్పటికీ మరవలేనని చంద్రబాబు భావోద్వేగంగా ప్రసంగించారు. కూటమి చారిత్రక విజయంలో పవన్ పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు.

**కూటమి ఏర్పాటులో పవన్ కీలక పాత్ర**

2014 ఎన్నికల సమయాన్ని గుర్తుచేసుకున్న చంద్రబాబు, "ఆనాడు బీజేపీతో పొత్తు ఖరారైన తర్వాత, పవన్ కల్యాణ్ గారిని కలవడానికి నేను స్వయంగా వారి ఇంటికి వెళ్లాను. రాష్ట్ర భవిష్యత్తు, దేశ రాజకీయాల దృష్ట్యా ఎన్డీయే కూటమికి బేషరతుగా మద్దతు ఇస్తానని పవన్ ఆ రోజు చెప్పారు. ఆ మాటను నిలబెట్టుకున్నారు. ఏపీ, తెలంగాణ రెండు రాష్ట్రాల్లోనూ మాకు మద్దతుగా నిలిచారు" అని వివరించారు. అలాగే, 2024 ఎన్నికలకు ముందు తాను జైల్లో ఉన్నప్పుడు, రాష్ట్ర భవిష్యత్తు కోసం పార్టీలన్నీ కలిసి పోటీ చేయాలని పవన్ కల్యాణ్ తీసుకున్న చొరవను చంద్రబాబు ప్రత్యేకంగా ప్రశంస

**అది చారిత్రక విజయం**

2024 ఎన్నికల్లో కూటమి సాధించిన విజయం అసాధారణమైనదని ముఖ్యమంత్రి చంద్రబాబు అభివర్ణించారు. "నేను ఎన్నో ఎన్నికల్లో పోటీ చేశాను. కానీ 94 శాతం స్ట్రైక్ రేట్‌తో, 175 స్థానాలకు గాను 164 సీట్లు గెలిచిన ఏకైక ఎన్నిక ఇదే. ఇది మూడు రాజధానులకు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఇచ్చిన స్పష్టమైన తీర్పు. ఈ విజయంతో రాష్ట్రంలో మళ్లీ మంచి రోజులు ప్రారంభమయ్యాయి" అని చంద్రబాబు అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందిస్తామని హామీ ఇచ్చారు.

**రాష్ట్రానికి వైసీపీ ద్రోహం చేసింది**

గత వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వైసీపీ ద్రోహం చేసింది. అమరావతిని శివసేన, బీజేపీ, చివరికి కాంగ్రెస్ కూడా అంగీకరించాయి. కానీ కేవలం రాజకీయ లబ్ధి కోసం రాజధానిని నాశనం చేసిన ఏకైక పార్టీ వైసీపీనే" అని ఆయన ధ్వజమెత్తారు. గత ఐదేళ్లలో అమరావతి రైతులు, ప్రజలు పడిన బాధ వర్ణనాతీతమని అన్నారు.

**అమరావతి పనులు మళ్లీ ప్రారంభం**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమరావతి పనులను పునఃప్రారంభించామని చంద్రబాబు తెలిపారు. "ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేసిన ఒక నగరంలో పనులు ఆగిపోయి, మళ్లీ రీస్టార్ట్ కావడం చరిత్రలో అమరావతిలోనే జరుగుతోంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రూ. 15,000 కోట్లు మంజూరు చేసింది. మే 2, 2025న పనులు పునఃప్రారంభించాం. నిధుల సమీకరణకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం" అని సభకు వివరించారు.

**2028 నాటికి పూర్తి.. పక్కా టైమ్‌లైన్**

అమరావతి నిర్మాణ పనుల పూర్తికి సంబంధించిన స్పష్టమైన గడువులను కూడా సీఎం చంద్రబాబు సభలో ప్రకటించారు. మంత్రి నారాయణ అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆ వివరాలను వెల్లడించారు. "ట్రంక్ రోడ్లన్నీ 2027 మే 27 నాటికి పూర్తవుతాయి. అసెంబ్లీ భవనాన్ని 2028 మే 28 నాటికి, హైకోర్టును 2028 జూన్ 20 నాటికి పూర్తి చేస్తాం. ఐదు ఐకానిక్ టవర్లను 2028 ఆగస్టు 4 నాటికి పూర్తి చేసి రాజధానిని అనుకున్న సమయానికి ప్రజలకు అందిస్తాం" అని చంద్రబాబు స్పష్టం చేశారు.



# పరీక్షా కేంద్రాలు తనిఖీ

**కందుకూరు పెన్ పవర్ మార్చి 28**

పట్టణంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను మండల విద్యాశాఖాధికారి ఎం. నాగ కుమార శర్మ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, గురుస్థాన్, విజ్ఞాన్ విహార్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి బయాలజీ పరీక్ష జరుగు తీరు తెన్నులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శర్మ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాలను విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీ చేసినట్లు తెలిపారు. కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావరణంలో నిబంధనలకు అనుగుణంగా పరీక్షలు జరుగుతున్నాయని తెలిపారు ప్రతి సెంటర్లలో సిట్టింగ్ స్క్వాడ్ పర్యవేక్షణలో పరీక్షలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. పట్టణంలో 10వ తరగతి పరీక్షలు సజావుగా జరుగుతున్నాయని ఎంఈఓ తెలిపారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నట్లు తెలిపారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

# డాక్యుమెంటరీ, పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి గొట్టిపాటి, ఆనం





**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 28**

గిద్దలూరు నియోజకవర్గం, రాచర్ల మండలం, పుల్లల చెరువు గ్రామంలో నల్లమల్ల అటవీ ప్రాంతంలో వెలిసిన నెమలిగండ్ల రంగనాయక స్వామి వారి ఆలయంలో నిర్వహించబడనున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ చరిత్ర , విశిష్టతను ప్రతిబింబించే డాక్యుమెంటరీని, పోస్టర్ ను మంత్రి గొట్టిపాటి రవికుమార్ తో కలిసి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి శనివారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ... నల్లమల్ల అటవీ ప్రాంతంలో వెలిసిన నెమలిగండ్ల రంగనాయక స్వామి ఆలయం ఆధ్యాత్మికంగా అత్యంత విశిష్ట స్థానం కలిగి ఉందని పేర్కొన్నారు. స్వయంభుగా వెలసిన ఈ స్వామివారు భక్తులకు విశేషమైన అనుగ్రహాన్ని ప్రసాదిస్తారని, ముఖ్యంగా ఈ ఆలయం ప్రతి శనివారం మాత్రమే భక్తులకు దర్శనమిచ్చే ప్రత్యేకత కలిగిన క్షేత్రమని తెలిపారు. ఆలయ చరిత్ర ఎంతో పురాతనమై భక్తులకు ఆధ్యాత్మిక ప్రేరణనిచ్చేదిగా ఉందన్నారు. ఈ డాక్యుమెంటరీ ద్వారా ఆలయ వైభవం, సంప్రదాయాలు, విశేషాలు మరింత విస్తృతంగా ప్రజలకు చేరుతాయని ఆయన పేర్కొన్నారు. ఏప్రిల్ 2 నుండి ఏప్రిల్ 5 వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించబడనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 2న అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహించబడతాయని, అదే రోజు రాత్రి శేషవాహనంపై స్వామివారి ఊరేగింపు జరుగుతుందని వెల్లడించారు. ఏప్రిల్ 3 ,4 తేదీలలో స్వామివారి కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించబడుతుందని తెలిపారు. ఏప్రిల్ 4న తెప్పోత్సవం , సాయంత్రం రథోత్సవం వైభవంగా జరుగుతాయని, ఏప్రిల్ 5న చక్రస్నానం కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయని మంత్రి ఆనం వివరించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి , మార్కాపురం శాసన సభ్యులు కందుల నారాయణ రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి మల్లవరపు నాగయ్య , ఒంగోలు జిల్లా దేవాదాయ శాఖ అధికారి పానకాల రావు, ఇతర అధికారులు , ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల సేవలు మరువరానివి

## కొమరోలు మండలంలోని సర్పంచులను సన్మానించిన

## గిద్దలూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త కుందూరు నాగార్జున రెడ్డి





**కొమరోలు పెన్ పవర్ మార్చి 28**

గ్రామాలను అభివృద్ధి పదంలో నడిపి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో సర్పంచులు చేసిన సేవలు కృషి మరువరానిదని గిద్దలూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త కుందూరు నాగార్జున రెడ్డి పేర్కొన్నారు. సర్పంచుల పదవీకాలం వచ్చే నెల రెండవ తేదీతో ముగియనున్నది .ఆ సందర్భాన్ని పురస్కరించుకొని కొమరోలు మండలంలోని సర్పంచు లను సన్మానించి వారి సేవలను కొనియాడెందుకు వీలుగా శనివారం కొమరోలు లోని వైసీపీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు ఆ కార్యక్రమానికి కొమరోలు జడ్పిటిసి సభ్యులు సారే వెంకట నాయుడు అధ్యక్షత వహించగా గిద్దలూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త కుందూరు నాగార్జున రెడ్డి కొమరోలు మండలం వైసిపి ఇన్చార్జి వేస్తారు పేట మండల అధ్యక్షుడు ఓ సూరారెడ్డి, కొమరోలు మండల వైసీపీ సీనియర్ నాయకులు నాదెళ్ల వెంగయ్య చౌదరి ,మండల పరిషత్ ఉపాధ్యక్షులు షేక్ మౌలాలి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరయ్యేందుకు కొమరోలు వచ్చిన కుందూరు నాగార్జున రెడ్డి ఓసూరా రెడ్డిలను వైసీపీ నేతలు శాలువా పూలమాలతో సన్మానించి స్వాగతం పలికారు. ఆ సందర్భంగా కొమరోలు మండలంలోని పుల్లారెడ్డిపల్లి సర్పంచ్ వైజా నారాయణరెడ్డి ,బాదినేనిపల్లి సర్పంచ్ ముత్తుముల జయరామిరెడ్డి ,నల్లగుంట్ల సర్పంచ్ గుడిపాటి ప్రదీప్,అల్లినగరం సర్పంచ్ బంగారు రత్నాలు ,దద్దవాడ సర్పంచ్ భూమా రమణమ్మ, తాటిచెర్ల సర్పంచ్ బొమ్మిని రంగమ్మ ,సూరవారిపల్లి సర్పంచ్ బోయిళ్ళ కాశమ్మ, చింతలపల్లి సర్పంచ్ సారే రవణమ్మ ,తదితర సర్పంచులను శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం నాగార్జున రెడ్డి మాట్లాడుతూ ఒంగోలు మండలంలో 14 మంది సర్పంచులు ఉండగా ఈరోజు నిర్వహించిన కార్యక్రమానికి కొన్ని అనివార్య, వారి వ్యక్తిగత కారణాల వలన కొందరు సర్పంచులు హాజరు కాలేకపోయారని ఆయన తెలిపారు .2021 సంవత్సరంలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలలో కొమరోలు మండలంలోని 14 గ్రామపంచాయతీల సర్పంచుల పదవులకు వైసీపీ అభ్యర్థులు ఎంపిక కావడం హర్షణీయం అభినందనీయమని, పేర్కొన్నారు .అంతేకాక మండలంలోని 12 ఎంపీటీసి స్థానాలు కూడా వైసీపీ పార్టీ కైవసం చేసుకోవడం కూడా గొప్ప పరిణామమని, దీనితో మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని నిరూపించారని ఆయన పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సర్పంచులు చేసిన సేవలు మరువరానివని అంటూ, సర్పంచులను అభినందించారు. 2021 నుంచి 2024 వరకు వైసిపి ప్రభుత్వంలో సర్పంచులు పనిచేశారని ,అయితే ఆ మధ్యకాలంలో రెండు సంవత్సరాలపాటు కరోనా రావడంతో అభివృద్ధికి అవాంతరం ఏర్పడిందని ఆయన తెలిపారు. ఆ తరువాత అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం సర్పంచ్ల చెక్కు పవర్ను రద్దు చేయడమే కాకుండా వారు చేసిన అభివృద్ధి కార్యక్రమాల బిల్లులను కూడా నిలిపివేసి సర్పంచులను తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురి చేశారని అంతేగాక గ్రామ పంచాయతీల అభివృద్ధికి విఘాతం కల్పించిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు అవసరమైన నిధులు మంజూరు చేస్తూ, సర్పంచులకు స్వేచ్ఛ ఇవ్వగలిగితే గ్రామపంచాయతీలు మరింత అభివృద్ధి పథంలో పయనించడంతోపాటు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు .రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో కూడా కొమరోలు మండలంలోని అన్ని స్థానాలలో వైసీపీ అభ్యర్థులే విజయం సాధించి కొమరోలు మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అనే వాస్తవాన్ని మరోసారి రుజువు చేయాలని ఆయన కోరారు. నేతలు, కార్యకర్తలు, సమన్వయంగా కృషి చేస్తూ వైఎస్ఆర్సిపి అభివృద్ధికి పాటుపడాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం సర్పంచులతో కలిసి నాగార్జున రెడ్డి కొమరోలు మండల వైసీపీ నేతలు గ్రూప్ ఫోటో తీయించుకున్నారు. కార్యక్రమంలో కొమరోలు మండల వైసీపీ కన్వీనర్ మేరీగా రవికుమార్, ఎంపిటిసి సభ్యులు ఎస్ఎం సుభాని, జాజం వెంకటరమణ ,సారే సుజాత ,జిల్లా వైసీపీ ప్రచార కమిటీ సమన్వయకర్త చెదుళ్ళ వెంకటరమణారెడ్డి, జిల్లా వైసీపీ బీసీ విభాగం సమన్వయకర్త సారే జనార్దన్ నాయుడు. గిద్దలూరు నియోజకవర్గం వైసీపీ ఎంప్లాయిస్ అండ్ ఎస్ విభాగం అధ్యక్షులు బంగారు విశ్వరూపం, జిల్లా డాక్టర్ల విభాగం ప్రతినిధి గోల్కొండ అబ్దుల్ సుభాన్, మండల వైసీపీ నేతలు గోల్కొండ అబ్దుల్ సత్తార్, గుడిపాటి ప్రసాద్ ,వులాపు రామచంద్రుడు, బంగారు వెంకటేశ్వర్లు, భూమా రమణయ్య, తిరుమలయ్య, సోషల్ మీడియా ప్రతినిధులు అవినాష్, పవన్ కళ్యాణ్ తో పాటు పలు గ్రామపంచాయతీల నుంచి భారీగా తరలివచ్చిన వైసిపి నేతలు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# జీరో వేస్ట్ క్యాంపస్ దిశగా కళాశాల అడుగులు



**కందుకూరు పెన్ పవర్ మార్చి 28**


జీరో వేస్ట్ క్యాంపస్ దిశ గా టి ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అడుగులు వేస్తుందని ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్ తెలిపారు. టి ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా వ్యర్థాల విభజన వ్యర్థ రహిత జీవనశైలి అనే ఇతివృత్త ప్రధానంగా స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రవి కుమార్ విద్యార్థులకు జీరో వేస్ట్ క్యాంపస్ అనే అంశంపై అవగాహన కలిగించే విధంగా కొన్ని సూచనలు అందించారు. వ్యర్థాలను కలపకుండా తడి చెత్త, పొడి చెత్తను వేరువేరుగా ఉంచేలా చర్యలు తీసుకోవడం చాలా అవసరమని తెలియజేశారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి స్టీల్ బాటిల్స్ వాడడం, గుడ్డ సంచులు వాడడం వంటి విషయాల్లో విద్యార్థులు బాధ్యతాయుతంగా మెలగాలని తెలియజేశారు. క్యాంటీన్ హాస్టల్ నుంచి వచ్చే ఆహార వ్యర్థాలను కాలేజీ వర్మీ కంపోస్ట్ యూనిట్లో వేసేలా చర్యలు తీసుకుని, ఈ కంపోస్టును కళాశాల తోటలు మొక్కల పెంపకం కోసం వినియోగించాలని సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేయబడిన క్లీన్ అండ్ గ్రీన్ ప్రోగ్రాంలో భాగంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలను సేకరించి కళాశాల క్యాంపస్ ని శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్ర ఏడుకొండలు ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి. రాజగోపాల్ బాబు, అకడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎన్ వి శ్రీహరి, వృక్ష శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఎన్.తిరుపతి స్వామి తెలుగు అధ్యాపకులు డాక్టర్ కె .సుజాత కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు డాక్టర్ జె .హనుమంతరావు చరిత్ర అధ్యాపకులు డాక్టర్ డి రామాంజనేయులు ఇతర అధ్యాపక సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



# శీలంవారిపల్లిలో అంగరంగ వైభవంగా గ్రామోత్సవం

## గ్రామోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు

## భక్తులను ఆకట్టుకున్న కోలాట సందడి





**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 28**

మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలో శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని శనివారం రాత్రి నిర్వహించిన సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి వార్ల గ్రామోత్సవ కార్యక్రమంలో కనిగిరి మాజీ శాసనసభ్యులు వైయస్సార్సీపి విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు ఈ సందర్భంగా గ్రామోత్సవములో కొట్టే కేశవయ్య కుమారుడు వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం కుమారులు కొట్టే నారాయణ బ్రదర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోలాటంలో కళాకారులు రంగురంగుల వస్త్రాలతో సమన్వయంతో నిర్వహించిన గ్రామోత్సవమునకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది దేవస్థాన కమిటీ చైర్మన్ కదిరి ప్రకాష్ రావు మరియు కమిటీ సభ్యులు , గ్రామస్తులు పర్యవేక్షణతో వేద పండితులు సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి వార్ల విగ్రహాలను ట్రాక్టర్ పై ప్రతిష్ఠించి పూలమాలలతో అద్భుతంగా అలంకరించి ప్రత్యేక డెకరేషన్లతో గ్రామంలోని పురవీధులలో డిజె సౌండ్ లతో యువకులు కేరింతల మధ్య మేళ తాళాలు, బాణాసంచా శబ్దాలు, విద్యుత్తు కాంతులతో ప్రతి వీధిలో పండుగ సందడిగా అంగరంగ వైభవంగా నిర్వహించారు ఇంటి ముందు స్వామివారికి గ్రామస్తులు ఘన స్వాగతం పలుకుతూ ఊరేగింపును ఆత్మీయంగా ఆహ్వానిస్తూ స్వామివారికి నీటితో వారు పోసి టెంకాయ, కర్పూరం పూజా సామాగ్రి స్వామివార్లకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు ఈ సందర్భంగా అర్చకులు భక్తులను ఆశీర్వదించి మంత్రోచ్చారణలతో పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు ఈ కార్యక్రమంలో కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల చైర్మన్ కదిరి ప్రకాష్ రావు, వ్యవసాయ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కదిరి పార్థసారథి, కదిరి వెంకట నరసయ్య లక్ష్మమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఇరగని చలపతిరావు, మాజీ ఎంపీటీసీలు మునగల వెంకటనారాయణ రెడ్డి, యం కాశిరెడ్డి, ఉప సర్పంచ్ తీకెనం బాబురావు, శీలం మాధవ ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

# కంపరాజు మరణం వైసిపికి తీర్చలేని లోటు

## –ఇంచార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్



**కందుకూరు పెన్ పవర్ మార్చి 28:** కంపరాజు సాంబశివ రాజు మృతి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని వైఎస్సార్ కందుకూరు నియోజకవర్గ ఇన్చార్జి బుర్రా మధు సూదన్ యాదవ్ ఒక ప్రకటనలో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కల్చరల్ వింగ్ జిల్లా అధ్యక్షునిగా తన బాధ్యతలను ఎంతో ఉన్నతంగా నెరవేర్చారని, గుడ్లూరు మండలంలో సీనియర్ నాయకుడుగా పార్టీ కార్యక్రమాల్లో తలలో నాలుకగా పనిచేసి ఎన్నో సేవలను అందించారు అన్నారు. పొట్లూరు గ్రామంలో, మండలంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని బలంగా,ఐక్యంగా ఉంచడంలో సాంబశివరావు పాత్ర ఎంతో ఉందని అన్నారు. ఆయన మరణం కుటుంబంతోపాటుగా వైఎస్సార్ కుటుంబాన్నికి కూడా ఎంతో బాధను, ఆవేదనను మిగిలించిందని వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని కోరుకుంటున్నాను అని తన సంతాప సందేశంలో తెలిపారు. ఈ కష్ట సమయంలో ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. సాంబశివరాజు లాంటి ఎంతో ముఖ్యమైన వ్యక్తిని కోల్పోయిన మీ కుటుంబానికి దేవుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సాంబశివరాజు విడిచి వెళ్లిన కుటుంబానికి అండగా ఉంటుందని తెలిపారు.

# నూతన బోరు ఏర్పాట్లను పరిశీలించిన సిరుకుపల్లి వెంకటరెడ్డి



**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 28**

మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో వేసవికాలంలో త్రాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఏర్పాటు చేస్తున్న నూతన బోరింగు పనులను శనివారం సింగిల్ విండో అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రత కారణంగా గ్రామ ప్రజలు మరియు మూగజీవాలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యగా కనిగిరి శాసనసభ్యులు, జిల్లా టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సూచనలతో బోరింగు ఏర్పాటు చేసామని, పశువులు దాహార్తి కొరకు నీటి సౌలభ్యం కోసం తొట్టెను ఏర్పాటు చేస్తామని అన్నారు ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు బోరు ఏర్పాటును అభినందిస్తూ చెరుకుపల్లి వెంకట రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బి నారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ షేక్ చాంద్, షేక్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

# పశు సంపద పట్ల ప్రభుత్వ ప్రత్యేక దృష్టి

## పొదిలి ఏఎంసి చైర్మన్ డాక్టర్ ఇమాంస



**పొదిలి, పెన్ పవర్, మార్చి 28**

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పశుసంపద పట్ల ప్రత్యేక దృష్టి సారిస్తుందని పొదిలి మార్కెట్ కమిటీ చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంస చెప్పారు. శనివారం నాడు పొదిలి నగర పంచాయతీ పరిధిలోని కాటూరి వారి పాలెం గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఏఎంసి చైర్మన్ డాక్టర్ ఇమాంస మాట్లాడుతూ పశు యజమానులు తమ పశువుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పశువుల్లో వచ్చే గర్భకోశ వ్యాధుల గురించి రైతులు అప్రమత్తంగా ఉంటూ పశువులను కాపాడుకోవాలని సూచించారు. పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని డాక్టర్ ఇమాంస చెప్పారు. పశువుల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పశు యజమానులు సద్వినియోగపరుచుకోవడం ద్వారా ఆర్థికంగా ఎదగాలని ఆయన కోరారు. పశు వైద్య శిబిరంలో పశువులకు నిపుణులైన డాక్టర్ల ద్వారా ఉచిత పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ప్రతాప్, కార్యదర్శి రవిశంకర్ రెడ్డి, పశు వైద్యాధికారి వేణు, మాజీ జెడ్పిటిసి కాటూరి వెంకటనారాయణ బాబు, మాజీ సర్పంచ్ కాటూరి వెంకటనారాయణ ప్రతాప్, పొదిలి ఏఎంసి డైరెక్టర్ రోళ్ళా శ్రీను, షేక్ షహనాజ్ బేగం, సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

# పట్టాభిరామ దేవాలయం వార్షికోత్సవంలో ముత్తుముల క్రిష్ణ కిశోర్

**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 28**

గిద్దలూరు మండలం సంజీరావుపేట అంకిరెడ్డిపల్లె గ్రామంలో శ్రీ పట్టాభిరామ దేవాలయం 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన అభయాంజనేయస్వామి యంత్ర , విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమమలో టిడిపి నాయకులు ముత్తుముల క్రిష్ణ కిశోర్ రెడ్డి పాల్గొన్నారు. కమిటీ సభ్యులు, నాయకులు, గ్రామస్తులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం క్రిష్ణ కిశోర్ పలికారు ఈ సందర్భంగా ఆయన అభయాంజనేయ స్వామి ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగిన యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం భక్తిశ్రద్ధల నడుమ కొనసాగింది. అనంతరం గ్రామంలో నిర్వహించిన సంప్రదాయ ఎడ్ల బందపందెం ను ముత్తుముల క్రిష్ణ కిశోర్ రెడ్డి తలకు రుమాలు చుట్టి , చెలకోలా చేబట్టి ఎడ్లను తోలి పందెం ప్రారంభించారు. బండ పందెం



మొదటి, మూడవ బహుమతి బహుమతి అందిస్తున్న నంది శ్రీనివాసులు, జెడ్పిటిసి బుడతా మధు సుధన్ , బండ బహుకరించిన దంపతులకు క్రిష్ణ



కిశోర్ శాలువా తో సన్మానించి ఆయన చేతుల మీదుగా నగదు కమిటీ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు క్రిష్ణ కిశోర్ రెడ్డిని శాలువా, పూల మాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి బుడతా మధు సుధన్, నంది శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి, ముండ్లపాడు సర్పంచ్ కడియం శేషగిరి, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# చిన్నారుల విద్యాభివృద్ధే ప్రధాన లక్ష్యం..

## అంగన్‌వాడీ కార్యకర్త హెప్సీబా



**పుల్లల చెరువు పెన్ పవర్ మార్చి 28**

పుల్లల చెరువు గ్రామంలో చిన్నారుల విద్యాభివృద్ధి ప్రధాన లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రం ఎస్సీ--2 ఆధ్వర్యంలో ఈసీసీఈ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం గ్రామంలో విద్యాపట్ల అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషించింది. 3 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల చిన్నారులు విద్యా సంవత్సరాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేకంగా ఈ వేడుకలను నిర్వహించారు. చిన్నారుల మానసిక, శారీరక అభివృద్ధికి ప్రాథమిక విద్య ఎంత ముఖ్యమో తెలియజేస్తూ గ్రామస్థుల సమక్షంలో ఉత్సాహభరిత వాతావరణంలో కార్యక్రమాలు కొనసాగాయి. చిన్నారులు పాటలు, ఆటలు, వినోదాత్మక కార్యక్రమాలతో సందడి చేసి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పుల్లల చెరువు ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వేముల కోటేశ్వరరావును ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఆయన చేతుల మీదుగా 5 సంవత్సరాలు పూర్తయిన చిన్నారుల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న చిన్నారుల తల్లిదండ్రులను ప్రత్యేకంగా ఆహ్వానించి, తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి కార్యకర్త హెప్సీబా మాట్లాడుతూ గ్రామంలో విద్యాభివృద్ధి సాధనకు ఇది ముఖ్యమైన అడుగని ఆమె అన్నారు. ఎన్రోల్మెంట్ డ్రైవ్‌ను భాగంగా తీసుకొని, ప్రతి చిన్నారికి ప్రాథమిక విద్య అందేలా చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ సిబ్బంది కృషి చేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు పిల్లల పోషణ, ఆరోగ్య సంరక్షణ, విద్యాపట్ల బాధ్యతలపై అవగాహన కల్పించారు. చిన్నారుల భవిష్యత్తు బాగుండాలంటే ప్రారంభ దశ నుంచే సరైన దిశలో విద్య అందించాల్సిన అవసరం ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామంలోని తల్లిదండ్రులు పాల్గొని తమ పిల్లల విద్యపై ఆసక్తి చూపించారు. చిన్నారుల భవిష్యత్తు కోసం ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు.

# కొమరోలులో నిర్వహించిన కార్డెన్ సర్చ్‌లో

# 40 వాహనాలకు జరిమానా





**కొమరోలు పెన్ పవర్ మార్చి 28**

కొమరోలు లోని నాయి బ్రాహ్మణ కాలనీలో శనివారం నిర్వహించిన కార్డెన్ సర్చ్ కార్యక్రమంలో సరైన ధ్రువపత్రాలు లేని 40 వాహనాలను స్వాధీనం చేసుకుని వాటి యజమానులకు జరిమానా విధించామని కొమరోలు ఎస్సై జే .నాగరాజు తెలిపారు. మార్కాపురం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు గిద్దలూరు రూరల్ జె, రామకోటయ్య ఆధ్వర్యంలో కొమరోలు ఎస్సై నాగరాజు, రాచర్ల ఎస్సై తోపాటు కొమరోలు, గిద్దలూరు, రాచర్ల పోలీసు సిబ్బంది శనివారం ఆకస్మికంగా నాయి బ్రాహ్మణ కాలనీలో కార్డెన్ సర్చ్ నిర్వహించి విస్తృత తనిఖీలు చేశారు. ఆ సందర్భంగా సరియైన ధ్రువపత్రాలు లేని 40 ద్విచక్ర వాహనాలను గుర్తించి వాటి యజమానులకు జరిమానా విధించారు. ఆ సందర్భంగా ఆ కాలనీవాసులకు సీఐ రామకోటయ్య పలు సూచన సలహాలు ఇస్తూ, అసాంఘిక కార్యకలాపాలకు, జూదాలకు దూరంగా ఉండాలని, అలాగే నాటుసారా తయారీ, విక్రయాలకు కూడా దూరంగా ఉండాలని ఆయన సూచించారు .నాటు సారా, గుట్కా ప్యాకెట్లు, మారణాయుధాలు కలిగి ఉన్న వారిపై కేసులు నమోదు చేసి కఠిన శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలని ఆయన కోరారు. ఏవైనా అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే పోలీసులకు అందించి సహకరించాలని ఆయన కోరారు.

# పెట్రోల్, డీజిల్ పై ఎక్సైజ్ సుంకం రద్దు

## డాక్టర్ ఏలూరి హర్షం



**మార్కాపురం పెన్ పవర్ మార్చి 28**

ఇంధన ధరల విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయంపై బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. పెట్రోల్‌పై ఎక్సైజ్ డ్యూటీని రూ. 13 నుంచి రూ. 3కు తగ్గించడం, డీజిల్‌పై ఉన్న రూ. 10 ఎక్సైజ్ సుంకాన్ని పూర్తిగా రద్దు చేయడం ప్రజలకు భారీ ఉపశమనం కలిగించే నిర్ణయమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అంతర్జాతీయ పరిస్థితులు, ముఖ్యంగా గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల కారణంగా ఇంధన సరఫరాలో ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నప్పటికీ, దేశ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం కేంద్ర ప్రభుత్వ దూరదృష్టికి నిదర్శనమని ఆయన అన్నారు. సాధారణంగా ఇలాంటి సంక్షోభ పరిస్థితుల్లో ప్రభుత్వాలు ప్రజలపై పన్నుల భారం మోపడం జరుగుతుందని, అయితే బీజేపీ ప్రభుత్వంలో మాత్రం ప్రజలపై అదనపు భారం పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ నిర్ణయం ద్వారా సాధారణ ప్రజలు, రైతులు, రవాణా రంగం వంటి అన్ని వర్గాలకు ఉపశమనం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. మొత్తంగా ఈ ఎక్సైజ్ సుంకం తగ్గింపు నిర్ణయం ప్రజాహితానికి అనుకూలంగా తీసుకున్న కీలక నిర్ణయమని, దేశ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుతూ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకున్న చర్యగా డాక్టర్ ఏలూరు రామచంద్రారెడ్డి కొనియాడారు.

# సుమంత్ కు ఆర్థికసాయం చేసిన జానకంపేట యువకులు

## *రూ:10,000/- లు అందజేత*



**గుడ్లూరు, పెన్ పవర్, మార్చి 28**

మండలంలోని చిమిడితపాడు గ్రామానికి చెందిన అల్లూరు సుమంత్ కొన్నిరోజులు క్రితం మాచవరం గ్రామం దగ్గర ప్రమాదానికి గురై హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు. వీరిది నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థికసాయం కోసం విన్నవించుకోగా, గుడ్లూరు మండలం జానకంపేట గ్రామానికి చెందిన యువకులు ఆర్థికసాయం శనివారం అందజేశారు. బాధితుడు సుమంత్ తల్లిదండ్రులు ఆర్థిక పరిస్థితి బాగాలేదని తెలుసుకొని జానకంపేట గ్రామం నుంచి జీ.ఎన్.ఆర్ సేవా సంస్థ వారు పూజశ్రీ మెడికల్స్ మనోహర్, వెంగళరావు, హరిబాబు, మనోజ్, సునీల్, వెంకటేష్, కార్తీక్, వంశీ, మధన్, దత్తు, బన్నీ మరియు మిత్రబృందం సభ్యులు వారి గ్రామం తరుపున రూ:10,000/-లను తమ వంతు సాయంగా సుమంత్ కుటుంబ సభ్యులకు అందజేసి మానవతా విలువలతో పాటు సేవాగుణాన్ని చాటుకున్నారు.

# అదనపు ఎల్ఈడీ లైట్ల వాడకంపై వాహనదారులకు అవగాహన



**గుడ్లూరు, పెన్ పవర్, మార్చి 28:**

గుడ్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా వాహనాలకు ఏర్పాటు చేసిన ఎక్స్ట్రా ఎల్ఈడీ లైట్లను స్థానిక ఎస్ఐ వి.వెంకట్రావు తన సిబ్బందితో కలిసి శనివారం తొలగించి, వాటివలన జరిగే ప్రమాదాన్ని వివరిస్తూ వాహనదారులకు అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. మీయొక్క వాహనాలకు ఎక్స్ట్రా ఎల్ఈడి లైట్స్ పెట్టుకొని, వాడటం వలన ఎదురుగా వచ్చే వాహనదారులకు ఇబ్బంది కలిగి, యాక్సిడెంట్ జరుగుచున్నవని అన్నారు. ఎవరికి వారు వాలంటరీగా వాటిని తొలగించుకోవాలని ఎస్సై వెంకట్రావు సూచించారు. అలా కాకుండా అదనపు ఎల్ఈడీ లైట్లను మీ యొక్క వాహనాలకు వినియోగిస్తున్నట్లు అయితే జరిమానాలతో పాటు కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# గౌతమ్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన మితికాల గురవయ్య

**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 28**



వైఎస్ఆర్సిపి రాష్ట్ర ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు, పల్నాడు జిల్లా పార్లమెంట్ పరిశీలకులు పూనూరు గౌతమ్ రెడ్డి పుట్టినరోజు రోజు సందర్భంగా జిల్లా వైఎస్ఆర్సిపి ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు మితికాల గురవయ్య హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌతమ్ రెడ్డి ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తూ, కార్మిక వర్గానికీ, పార్టీ బలోపేతానికీ సేవలందిస్తు, పార్టీ కార్యాచరణలో చూపుతున్న నిబద్ధత, నాయకత్వంతో పార్టీకి మరింత బలాన్నిచేస్తోందని అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# మండల కేంద్రంలో "స్వర్ణాంధ్ర-స్వచ్ఛఆంధ్ర " భారీర్యాలీ



## జీరో వేస్ట్ ఇన్స్టిట్యూట్స్ లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమం.

## బస్టాండ్ సెంటర్లో మానవహారం, ప్రతిజ్ఞ నిర్వహణ.




**గుడ్లూరు, పెన్ పవర్, మార్చి 28**

మండల కేంద్రంలో నాలుగవ శనివారం సందర్భంగా "స్వర్ణాంధ్ర - స్వచ్ఛఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా భారీర్యాలీ ఎంపీడీఓ వై.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ర్యాలీలో పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, విద్యుత్ వినియోగంలో సోలార్ పాత్ర పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. ముఖ్యంగా జీరో వెస్టేజ్ లక్ష్యంతో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, వ్యర్థాలను వేరు చేయడం, పరిసరాలను శుభ్రంగా ఉంచడం వంటి అంశాలపై ప్రజలకు సూచనలు చేశారు. ఎల్ఈడి లైట్ల వినియోగం స్విచ్ ఆఫ్ విధానం గురించి వివరించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచాలనే సంకల్పంతో ర్యాలీ విజయవంతంగా అవగాహన కల్పిస్తూ సాగింది. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని పంచాయతీల గ్రీన్ అంబాసిడర్లు 30 మందికిపైగా ట్రై సైకిళ్లను, ఈ-ఆటోను అన్ని గ్రామాల లోని ప్రతి ఇంటి నుండి పొడి చెత్తను సేకరించే విధంగా ఏర్పాటు చేయబడిన స్వచ్ఛ రథమును ర్యాలీలో పెట్టి, ప్రత్యేకంగా ఆకర్షణ ర్యాలీ నిర్వహించడం జరిగింది. అనంతరం ఈ ర్యాలీ బస్టాండ్ సెంటర్ వరకు వెళ్లి బస్టాండ్ సెంటర్లో మానవహారాన్ని ఏర్పాటు చేశారు. స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ ను ప్రతి ఒక్కరితో చేయించారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర -- స్వర్ణఆంధ్ర ర్యాలీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి జానకంపేట బిఎన్నార్ ట్రస్ట్ వారిచే మజ్జిగ నిమ్మ రసాన్ని పంపిణీ చేయడంతో పాటుగా ఆర్యవైశ్య సంఘం వారి యొక్క పూర్తి సహకారాన్ని అందజేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వై.వెంకటేశ్వరరావు, మండల స్థాయి అధికారులు, స్థానిక నాయకులు మేకపోతుల రాఘవులు, జొన్నలగడ్డ రమణమ్మ, జనసేన మండల అధ్యక్షులు సన్నిశెట్టి గిరిబాబు, బిజెపి మండల అధ్యక్షులు వరుణ్, సుధాకర్ లు, ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీతా రామస్వామి గ్రామోత్సవం

## ఆకట్టుకున్న కోలాటం, కేరళ డోల్ వాయిద్యాలు





**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 28**

గిద్దలూరు పట్టణంలోని శ్రీ సీతారామ స్వామి దేవాలయం శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శ్రీరామనవమి అర్వదినాన్ని పురస్కరించుకుని సీతా రాముల కల్యాణం కమణీయంగా జరిపించారు. శనివారం అత్యంత వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. కేరళ డప్పు వాయిద్యాలు, చిన్నారులు,మహిళల కోలాటం, బ్యాండు మేళం వాయిద్యాలతో జై శ్రీరామ్ నినాదాలు మధ్య కోలాహలంగా కొనసాగింది. భక్తులు స్వామి వారికి భక్తులు కాయాకర్పూరం సమర్పించారు .

# మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో 'స్వచ్ఛ సర్వేక్షన్' పై విద్యార్థులకు అవగాహన సదస్సు




**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 28**

గిద్దలూరు మున్సిపల్ కమిషనర్ ఈ.వి. రమణ బాబు ఆధ్వర్యంలో విశ్వభారతి పాఠశాల విద్యార్థులకు పరిశుభ్రతపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రమణ బాబు మాట్లాడుతూ చెత్త వర్గీకరణ ,ఇంటి వద్దే చెత్తను తడి చెత్త, పొడి చెత్త మరియు హానికర చెత్తగా వేరు చేయడం వల్ల కలిగే ఉపయోగాలు వివరించారు. ప్లాస్టిక్ నిర్మూలన ఒక్కసారి మాత్రమే వాడి పారేసే ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి జరిగే తీరని నష్టం వాటిల్లితుందని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత వ్యాధుల నివారణలో వ్యక్తిగత పరిశుభ్రత , ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం యొక్క ప్రాముఖ్యత పర్యావరణ పరిరక్షణ పర్యావరణాన్ని కాపాడుకోవడం మన బాధ్యత అని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బందారు ఆదిలక్ష్మి, శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస రెడ్డి, వార్డు శానిటేషన్ సెక్రటరీలు , ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. విద్యార్థులు తమ ఇళ్లలో కూడా ఈ విషయాలను తల్లిదండ్రులకు వివరించి, గిద్దలూరును స్వచ్ఛమైన పట్టణంగా మార్చడంలో భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు.

# నేత్రపురి శ్రీరామసేవక్ ఆధ్వర్యంలో చల్లనిమజ్జిగ శీతలపానియాలు పంపిణీ

## దాత జీఎన్ఆర్ సేవా సంస్థ(జానకంపేట)కు అభినందనలు





**గుడ్లూరు, పెన్ పవర్, మార్చి 28**

మండల కేంద్రమైన గుడ్లూరు బస్టాండ్ సెంటర్ లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నేత్రపురి శ్రీరామసేవక్ ఆధ్వర్యంలో జానకంపేటకు చెందిన జీఎన్ఆర్ సేవా సంస్థ సభ్యుల సహకారంతో శనివారం చల్లని మజ్జిగతో పాటు సుగంధ వాటర్ ను వేసవి దృష్ట్యా పంపిణీ చేశారు. జి.ఎన్.ఆర్ సేవ సంస్థ సభ్యులు, గుడ్లూరులో పూజిత మెడికల్ షాప్ నిర్వాహకులు మనోహర్ మరియు మిత్రులు బస్టాండ్ సెంటర్లో ఉన్న ప్రయాణికులకు, చల్లని మజ్జిగను వారి చేతుల మీదుగా అందించి ఈకార్యక్రమాన్ని ప్రారంభించి ప్రయాణికులకు, వాహన చోదకులకు, స్థానిక ప్రజలకు అందజేశారు. నేత్రపురి శ్రీరామసేవ సభ్యులైనటువంటి ఎయిర్టెల్ చిన్నా మాట్లాడుతూ గుడ్లూరుకు చెందిన యశ్వంత్ సాయి తేజ మెమోరియల్ ట్రస్ట్ మరియు నేత్రపురి శ్రీరామసేవక్ సంయుక్త ఆధ్వర్యంలో మంచినీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ఉన్నామని గ్రామస్తులు ప్రయాణికులు వినియోగించుకోవాలని తెలియజేశారు. మేము చేసే సేవా కార్యక్రమాల్లో సహాయ సహకారాలు అందించాలని మనోహర్ వారి గ్రామములో ఉన్న జిఎన్ఆర్ సేవా సంస్థ సభ్యులతో మాట్లాడగా, వారు స్పందించి మేము మావంతుగా ఏదైనా సేవా కార్యక్రమాలు చేయాలన్న సంకల్పంతో ఉన్నామని తెలిపి, మజ్జిగ మరియు సుగంధ వాటర్ పంపిణీ కార్యక్రమానికి సహకరించారని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ సేవా భావంతో ఉండాలని ఇటువంటి సేవా కార్యక్రమాలు చేసే వారికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గుడ్లూరు ఎంపీడీఓ వై.వెంకటేశ్వరరావు నేత్రపురి శ్రీరామసేవక్ సభ్యులను మరియు జిఎన్ఆర్ సేవా సంస్థ సభ్యులను అభినందించారు. ఈరోజు జరిగిన ఈ కార్యక్రమం ద్వారా సుమారుగా 500 మందికి చల్లని మజ్జిగ మరియు శీతల పానీయాలను అందించినటువంటి జిఎన్ఆర్ సేవా సంస్థ సభ్యులను నేత్రపురి శ్రీరామసేవ సభ్యులు కూడా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుడ్లూరు మండల బిజెపి మాజీ అధ్యక్షులు నేత్రపురి శ్రీరామ సేవక్ కార్యనిర్వాహకులు ఇన్నమూరి ప్రమీల సుధాకర్, ఆర్యవైశ్య సంఘశీ ఉపఅధ్యక్షులు ఎయిర్టెల్ చిన్న, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అమరా మాల్యాద్రి, ప్రధాన కార్యదర్శి ఇన్నమూరి గరటయ్య, జిఎన్ఆర్ సేవా సంస్థ సభ్యులు, పూజిత మెడికల్స్ మనోహర్, పాజర్ల బ్రహ్మయ్య, గొల్లమణి, మీడియా మిత్రుడు సి హెచ్.ఆంజనేయులు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉందాం

## పిలుపునిచ్చిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

## స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్రలో కార్యక్రమం, పాల్గొన్న జేసీ, అధికారులు






**విశాఖపట్నం, పెన్ పవర్ మార్చి 28**

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, రీయూజ్-రీ-సైకిల్ పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. వ్యర్థాలను తగ్గించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తోడ్పడవచ్చని ఆయన అన్నారు. జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన "స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర" కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ వ్యర్థాల వర్గీకరణ (సెగ్రిగేషన్)పై ప్రజల్లో మరింత అవగాహన అవసరమని పేర్కొన్నారు. డ్రై, వెట్ వ్యర్థాల వేర్పాటు గురించి అవగాహన ఉన్నప్పటికీ, ఇటీవల పెరుగుతున్న ఈ-వేస్ట్ నిర్వహణపై స్పష్టత తక్కువగా ఉందని చెప్పారు. ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఈ-వేస్ట్ పరిమాణం కూడా అధికమవుతోందని, వాటిని ప్రత్యేక బిన్లలో వేయాలని సూచించారు. ఈ-వేస్ట్‌ను సక్రమంగా నిర్వహించడం ద్వారా ప్రమాదకర రసాయనాల వల్ల భూమి, నీటి కాలుష్యం కలగకుండా నివారించవచ్చని వివరించారు. ఈ దిశగా కార్పొరేషన్ పరిధిలో ప్రత్యేక ఈ-వేస్ట్ బిన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి మాట్లాడుతూ శానిటేషన్ కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. శుభ్రపరిచే సమయంలో మాస్కులు, గ్లౌజులు వంటి రక్షణ పరికరాలు తప్పనిసరిగా వినియోగించాలన్నారు. రక్షణ చర్యలు పాటించకపోతే భవిష్యత్తులో ఆక్యుపేషనల్ హజార్డ్స్‌కు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలంటే ప్రతి ఉద్యోగి, ప్రతి పౌరుడు చురుకుగా పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం అధికారులంతా ప్రతిజ్ఞ చేశారు. కలెక్టరేట్ ఏవో బీవీ రాణి, జీవీఎంసీ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గిద్దలూరులో పోలీసుల వాహనాల తనిఖీలు

## - ప్రైవేట్ బస్సులపై నిఘా, అనధికారిక ఎల్ ఈ డి లైట్లపై స్పెషల్ డ్రైవ్

**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 28**



గిద్దలూరులో అనధికారిక ఎల్ ఈ డి మరియు అధిక తీవ్రత లైట్ల వినియోగంపై ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ నిర్వహించగా, మార్పులు చేసిన ఎల్ ఈ డి హెడ్‌లైట్లు, ఫ్లాష్ లైట్లు, మల్టీకలర్ లైట్లు అమర్చిన వాహనాలను తనిఖీ చేసి తొలగించారు. అదే సమయంలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై పోలీసులు కఠిన తనిఖీలు నిర్వహించారు. ఇటీవల జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 14 మంది మృతి చెందిన నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టారు. భద్రతా ప్రమాణాలు పరిశీలించి, బస్సుల్లో అత్యవసర అగ్నిమాపక సామాగ్రి, ఎమర్జెన్సీ కిటికీలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. డ్రైవర్లు మద్యం సేవించకూడదు, నిద్రమత్తులో వాహనం నడపరాదని హెచ్చరించారు. అధిక వెలుతురు వచ్చే ఎల్ఈడి లైట్లు వాడరాదని స్పష్టం చేస్తూ, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అర్బన్ సీఐ సురేష్ హెచ్చరించారు.

# ముప్పాళ్ళలో స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర కార్యక్రమం



**పొన్నలూరు,పెన్ పవర్ మార్చి 28**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రతి ఒక్కరు బాధ్యతగా ముందుకు రావాలని ఎంపీడీవో డాక్టర్ పి సుజాత కోరారు. మండలంలోని ముప్పాళ్ళ గ్రామంలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛంద కార్యక్రమం నిర్వహించారు. సుజాత మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తుందని దీన్ని తగ్గించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. పర్యావరణానికి హాని కలిగించని ప్రత్యమాయ వస్తువులను వినియోగించాలన్నారు. గ్రామంలో శుభ్రత పరిశుభ్రత ను కాపాడటం మన భాధ్యత అని దీని ద్వారా ఆరోగ్యకరమైన జీవన విధానం సాధ్యమవుతుందని ఆమె సూచించారు. అనంతరం సిబ్బంది గ్రామ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బి సతీష్ బాబు, పీడీఓ సుబ్బారావు, స్వర్ణ గ్రామ సిబ్బంది అంగన్వాడి సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకార కుటుంబానికి ఆర్థిక సహాయం



**కందుకూరు పెన్ పవర్ మార్చి 28**

పట్టణంలోని ముత్తరాశిపాలెం కు చెందిన మత్స్యకారుడు భీమనబోయిన నాగరాజు అనారోగ్యం కారణాలతో మృతి చెందారు. మత్స్యకారుల సంఘం నాయకుడు కొంగల నాగరాజు సంఘంలోని సభ్యులతో కలిసి భీమనబోయిన నాగరాజు పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. మత్స్యకార సంఘం తరపున పది వేలు రూపాయలు ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబానికి అందజేశారు. ముత్తరాశి మత్స్యకారులు కందుకూరు పట్టణ ప్రాంతంలో ఎక్కడైనా నివాశం ఉంటూ అనుకోని పరిస్థితులలో మృతి చెందిన యెడల వారి కుటుంబాలకు కందుకూరు మత్స్యకారుల సంఘం తరుపున సహాయంగా, అండగా వుంటామని సంఘం నాయకుడు కొంగల నాగరాజు తెలిపారు. ముత్తరాశి మత్స్యకారుని మృతి విషయం తెలుసుకున్న టిడిపి పట్టణ మాజీ అధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు, భీమనబోయిన నాగరాజు కుటుంబాన్ని పరామర్శించి ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం నాయకులు మోసంగి కోటేశ్వరరావు, రుద్రబోయిన రాజు, బయ్యా నాంచారయ్య, బాలిబోయిన తిరుమలరావు, గుబ్బరబోయిన రామరాజు. 12వ వార్డు టిడిపి అధ్యక్షుడు మోసంగి ప్రసాద్, రుద్రబోయిన రాజు, బైనీడి సుధాకర్, చింతరబోయిన మణికంఠ, వాసు, వెంకటేష్, మురళి, అనుముల శ్రీను, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# శీలంవారిపల్లి లో అంకాలమ్మ పోలేరమ్మ తిరునాళ్ల

**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 28**

మండలంలో శీలంవారిపల్లి గ్రామంలో గ్రామ దేవతలు అంకాలమ్మ పోలేరమ్మ తిరునాళ్లను 29,30 తేదీలలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 29 న ఉదయం 10 గంటలకు గ్రామ దేవతలు అంకాలమ్మ పోలేరమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు అలాగే రాత్రి 7 గంటలకు గ్రామోత్సవం 30 న గ్రామదేవతలకు నైవేద్యంగా సంప్రదాయ పద్ధతిలో పొంగళ్ళు సమర్పణ కార్యక్రమంతో పాటు మొక్కుబడులు సమర్పణ కార్యక్రమంను నిర్వహించనున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గ్రామ దేవతల పూజా కార్యక్రమంలో పాల్గొని పాల్గొని దర్శించుకొని అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు స్వీకరించి విజయవంతం చేయాలని కోరారు.

# ఏనుగు కొండపై పర్యాటక 'కళ' పీపీపీ విధానంలో రిసార్ట్స్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్!





**తాబేలు మెట్ట ఏనుగు కొండ అభివృద్ధిపై జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి స్పెషల్ ఫోకస్.**

**సీతానగరం, పెన్ పవర్, మార్చి28:**పురాతన రామాలయం ఉన్న రామ దుర్గం, తాబేలు మెట్ట ఏనుగు కొండ ప్రాంతంలో పర్యాటక రంగ అభివృద్ధి పనులను ప్రభుత్వప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి) విధానంలో చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. శనివారం సీతానగరం మండలంలోని పురుషోత్తమపట్నం గ్రామంలో పర్యటన సందర్భంగా రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రాయదుర్గం - ఏనుగు కొండ ప్రాంతం లో ప్రతిపాదించిన 7.5 ఎకరాల స్థలాన్ని ఆమె పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, పర్యాటక ప్రాంతాలుగా ప్రత్యేక గుర్తింపు పొందిన పురాతన రామాలయం ఉన్న రాయదుర్గం పర్యాటక కేంద్రం ఇక్కడే ఉందని పేర్కొన్నారు. అందులో భాగంగా ఏనుగు కొండ తాబేలు మెట్ట ప్రాంతంలో టూరిజం రిసార్ట్స్, రెస్టారెంట్లు వంటి యూనిట్ల స్థాపనకు అనువైన 7.5 ఎకరాల భూమిని గుర్తించినట్లు ఆమె తెలిపారు. ప్రభుత్వప్రైవేటు భాగస్వామ్యం కోసం అవసరమైన మార్గదర్శకాలను టూరిజం వెబ్‌సైట్‌లో విడుదల చేసినట్లు పేర్కొన్నారు.ఆసక్తి ఉన్న వెండర్లు దరఖాస్తు చేసుకోవాలని, ప్రభుత్వం అందించే పలు రాయితీలు, విద్యుత్ టారిఫ్ సబ్సిడీలు, జీఎస్టీ రాయితీలు తదితర ప్రయోజనాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ ప్రాంతం పర్యాటక, సాంస్కృతిక అభివృద్ధి దృష్ట్యా ప్రత్యేక ప్రాధాన్యం కలిగినదిగా పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పోలవరం ప్రాజెక్టును సందర్శించేందుకు వచ్చే పర్యాటకులకు ఈ ప్రాంతం అనుకూలంగా ఉండటంతో పాటు, రాబోయే గోదావరి పుష్కరాల నేపథ్యంలో వసతి సదుపాయాల కోసం ఇది ఉత్తమ కేంద్రంగా మారుతుందని తెలిపారు.

పర్యాటకులను ఆకర్షించే విధంగా సమగ్ర అభివృద్ధి చర్యలు చేపడుతున్నామని, ఆసక్తి గల పెట్టుబడిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కీర్తి చేకూరి విజ్ఞప్తి చేశారు. ఎంపీయుపి పాఠశాల సందర్శన పాఠశాలల్లో విద్య ప్రమాణాలు బోధన పద్ధతులు మౌలిక సదుపాయాల మధ్యాహ్నం భోజనం పథకాలు అమలు తదితర అంశాలను ప్రత్యేకంగా పరిశీలించారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర పై అవగాహన కల్పిస్తూ స్వచ్ఛమైన ఆరోగ్యమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో ప్రతి విద్యార్థి భాగ్య స్వామి అవసరమని పేర్కొన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీలు పారిశుద్ధ్యం పై నిర్లక్ష్యం వైఖరి పై ఆస్పత్రి మరియు పరిసరాల్లో పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యం కనిపించడంపై కలెక్టర్అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పారిశుధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో టూరిజం ప్రాంతీయ సంచాలకులు ఎన్‌వీ వి.వి. ఎస్. మూర్తి, జిల్లా టూరిజం అధికారి పి. వెంకట చలం, జిల్లా పాఠశాలవిద్యాశాఖ అధికారి కె. వాసుదేవరావు, తహసీల్దార్ అంకం శ్రీనివాస్ , ఎస్సై బి . వినయ్ ప్రతాప్ , తదితరులు పాల్గొన్నారు.

## అని గేరు లో 'స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం నిర్వహించిన, అడ్డతీగల ఎంపీడీవో కుమార్..





**అడ్డతీగల ,పెన్ పవర్ మార్చ్28:** అడ్డతీగల మండలం అనిగేరు గ్రామంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛంధ్ర కార్యక్రమం శనివారం అడ్డతీగల ఎంపీడీవో కుమార్ నిర్వహించారు. ఇందులో భాగంగా చెత్తను తగ్గించడం, పునర్వినియోగం మరియు రీసైక్లింగ్ ద్వారా భూమిని రక్షించడం, ప్లాస్టిక్ నిరాకరించడం, కాగితపు సంచులు మరియు గుడ్డ సంచులు వాడటం, ఇంటిలో తడిచెత్త కంపోస్ట్ చెయ్యడం, వ్యర్థాలు ఉత్పన్నం అయ్యే దగ్గర వేరు చేయడం, పొడి వ్యర్థాలను శాస్త్రీయ విధానంలో హరిత రాయబారుల ద్వారా సేకరించి, గ్రామపంచాయతీ కి అందించేలా తగు చర్యలు మరియు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం పూర్తిస్థాయిలో తగ్గింపు మరియు పర్యావరణహిత చర్యలను, పారిశుధ్య అవగాహనా కార్యక్రమాలను, శుభ్రతా కార్యక్రమాలను నిర్వహించవలసినదిగా గ్రామ ప్రజలకు ఎంపీడీవో వివరించారు. అనంతరం గ్రామస్తులచే ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రక్త క్యాన్సర్ పై అపోహాలు వీడాలి



- ఎముక మజ్జ మార్పిడి తో రక్త క్యాన్సర్ ను నివారణ సాధ్యం
- డా. కరుణ కుమార్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 29:** రక్త క్యాన్సర్‌పై ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించా ల్సిన అవసరం ఉందని యశోద హాస్పిటల్స్ - సికింద్రాబాద్ యూనిట్ ప్రముఖ హేమటాలజిస్ట్, బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్ నిపుణులు డా. కరుణ కుమార్ శనివారం మీడియా సమావేశంలో తెలిపారు. సరైన సమయంలో పరీక్షలు చేసి చికిత్స పొందితే చాలా మంది రోగులు పూర్తిగా కోలుకునే అవకాశ ముందన్నారు. రక్త క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించడం ఎంతో కీలకమని, లక్షణాలు సాధారణ అనారోగ్యంగా భావించి నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం ఉందన్నారు. తరచుగా జ్వరం రావడం, అలసట, బలహీనత, ఇన్ఫెక్షన్లు పునరావృతం కావడం, బరువు తగ్గడం, శరీరంలో గడ్డలు పెరగడం, రక్తస్రావం, నీలి మచ్చలు రావడం వంటి లక్షణాలు కనిపిస్తే హెమటాలజిస్ట్‌ను సంప్రదించాలన్నారు. బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్‌పై ప్రజల భయాలు అనవసరమన్నారు. ఇది శస్త్రచికిత్స కాదని, రక్త మార్పిడి విధానంలో జరిగే ప్రక్రియని తెలిపారు. సరైన రోగి ఎంపిక, తగిన డోనర్, అనుభవజ్ఞులైన వైద్య బృందం ఉంటే మంచి ఫలితాలు సాధించ వచ్చున్నారు.

ప్రజల్లో రక్త క్యాన్సర్, బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్‌పై అవగాహన పెరగాలని, నిపుణుల సలహా తీసుకోవాలన్నారు. ఉభయగోదావరి ప్రజలకు తాను ప్రతీ నెలా నాలుగో గురువారం రాజమండ్రిలో గల యశోద మెడికల్ సెంటర్ లో అందుబాటులో ఉంటానని తెలిపారు.

ఈ సమావేశం లో ఆంధ్రప్రదేశ్ మార్కెటింగ్ మేనేజర్ నల్లం బాల వీరభద్ర, ఎక్సిక్యూటివ్ రాఘవ చైతన్య తదితరులు పాల్గొన్నారు

# జిల్లాలో ఎల్‌పిజి సరఫరా నిరంతరం




**- జేసి మేఘా స్వరూప్**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 29:**తూర్పు గోదావరి జిల్లాలో గృహ అవసరాలు, అత్యవసర సేవలకు అవసరమైన ఎల్‌పిజి సరఫరా నిరంతరంగా కొనసాగుతోందని కలెక్టర్ (పొ.స) వై. మేఘా స్వరూప్ శనివారం తెలియ చేశారు. సంబంధిత ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు గ్యాస్ పంపిణీదారులతో నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నా మన్నారు. ప్రస్తుతం జిల్లాలో రోజుకు సుమారు 12,000 నుండి 12,500 వరకు గ్యాస్ సిలిండర్లు 52 పంపిణీదారుల ద్వారా సరఫరా జరుగుతుందని వై. మేఘా స్వరూప్ తెలిపారు. గ్యాస్ పంపిణీదారుల వద్ద సుమారు 14,362 సిలిండర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇటీవల బుకింగ్స్ సుమారు 90శాతం పెరగడంతో సిలిండర్ల డెలివరీలు మొదటి రాక మొదటి డెలివరీ విధానంలో కొనసాగు తుండటంతో కొంత జాప్యంఎం జరుగుతుందన్నారు. పెండింగ్ బుకింగ్స్ త్వరలోనే క్లియర్ చేస్తామని వై. మేఘా స్వరూప్ తెలిపారు.గ్యాస్ సిలిండర్లు వినియోగదారుల ఇళ్లకే సరఫరా చేస్తున్నామని గోడౌన్లకు వెళ్లాల్సిన అవసరం లేదని తెలిపారు. ప్రభుత్వం కమర్షియల్ సిలిండర్ల కేటాయింపును 70శాతం వరకు పెంచినందున వాటి సరఫరా కూడా సజావుగా కొనసాగుతుందన్నారు. వినియోగదారులు అధికంగా బుకింగ్స్ చేయడం, నిల్వ చేయడం నివారించి అవసరానికి మాత్రమే సిలిండర్లు బుక్ చేసుకోవాలని కోరారు. వినియోగదారులు ఐ వి ఆర్ ఎస్,వాట్సాప్, ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం, అమెజాన్ పే వంటి యూపీఐ యాప్స్ సులభంగా బుకింగ్స్ చేసుకోవచ్చని సూచించారు.గత కొద్ది రోజుల్లో 47 కేసులు నమోదు చేసి 119 సిలిండర్లు స్వాధీనం చేసుకున్నట్లు వై. మేఘా స్వరూప్ తెలిపారు. గ్యాస్ హోర్డింగ్, నల్లబజారు, అధిక ధరలకు అమ్మకాలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎల్‌పిజికి ప్రత్యామ్నాయంగా గోదావరి గ్యాస్ పైప్‌లైన్ నేచురల్ గ్యాస్ సరఫరా కోసం మునిసిపల్ కార్పొరేషన్, కొవ్వూరు మునిసిపాలిటీ, చాగల్లు పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు.

సుమారు 19,800 కనెక్షన్లకు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పారు. గృహ, వాణిజ్య వినియోగదారులు వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ కోరారు. జిల్లాలోని 208 పెట్రోల్ బంకుల ద్వారా పెట్రోలు, డీజిల్ సరఫరా నిరంతరంగా కొనసాగుతోందని వై. మేఘా స్వరూప్ తెలిపారు.

## నూతన ఎస్సై గా బి. వినయ్ ప్రతాప్ బాధ్యతలు స్వీకరణ



**సీతానగరం, పెన్ పవర్, మార్చి 28:**మండల కేంద్రమైన సీతానగరం ఎస్సై రామ్ కుమార్ బదిలీపై వెళ్లడంతో నూతన ఎస్సై గా బి. వినయ్ ప్రతాప్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కాకినాడ సీసీఎస్ నుంచి బదిలీపై వచ్చిన ఆయన గత ఎస్సై రామ్ కుమార్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణ తన ప్రథమ ప్రాధాన్యమని గతంలో జిల్లాలోని పనిచేసిన అనుభవం తనకు తోడ్పడుతుందని ఆయన పేర్కొన్నారు. మండలంలోని లా అండ్ ఆర్డర్ పై ప్రత్యేకంగా నిఘ ఉంచడం జరుగుతుందని, చోరీల నియంత్రణకు, జూదం, పేకాట, కోడి పందాలు తదితరాల నియంత్రణపై నాటు సారా తయారీ, అమ్మకాలు జరగకుండా గట్టి జాగ్రత్తలు వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం సిబ్బంది సమావేశంలో ఆయన పోలీస్ స్టేషన్లో సిబ్బంది తనకు చేదోడు వాదోడుగా ఉండి సహకరించాలని ఆయన కోరారు.

# 16వ వార్డు లో కమిషనర్ క్షేత్రస్థాయి పర్యటన




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 28:**16వ వార్డులో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా, స్థానిక బీజేపీ నాయకులు అడపా వరప్రసాద్ సహకారం తో మున్సిపల్ కమిషనర్ వార్డులో క్షేత్రస్థాయిలో పర్యటించారు. వార్డులోని డ్రైనేజీ, పారిశుధ్యం , ఇతర మౌలిక వసతుల లేమిని కమిషనర్ కి ప్రత్యక్షంగా వివరించారు. ఈ పర్యటనలో

డ్రైనేజీలు సక్రమంగా లేకపోవడం వల్ల మురుగునీరు రోడ్లపైకి వస్తోందని, స్థానికులు పడుతున్న ఇబ్బందులను వరప్రసాద్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వార్డులో చెత్తాచెదారం పేరుకుపోయి డంప్పింగ్ యార్డులా మారుతోందని, దోమల ఉధృతి పెరిగి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫాగింగ్ చేయించాలని కోరారు. వార్డులోని పార్కును అభివృద్ధి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని విన్నవించారు. అడపా వరప్రసాద్ చూపించిన ప్రతి సమస్యను పరిశీలించిన కమిషనర్ , తక్షణమే పారిశుధ్య పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వార్డు అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని, నిధుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీ వాసులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# యువకుడికి క్లిష్టమైన రిస్క్ రీడో బెంటాల్ గుండె శస్త్రచికిత్స



**రాజమహేంద్రవరం, పెన్ పవర్ మార్చి 29:**నగర పరిసర కూనవరం గ్రామానికి చెందిన పాతికేళ్ల యువకుడికి అత్యంత క్లిష్టమైన రిస్క్ రీడో బెంటాల్ గుండె శస్త్రచికిత్సను యశోద హాస్పిటల్స్- సికింద్రాబాద్ యూనిట్ లో విజయవంతంగా నిర్వహించామని శనివారం మీడియా సమావేశంలో ప్రముఖ కార్డియాక్ సర్జన్ డా. సుధీర్ వల్లూరి వివరించారు. ఈ యువకుడు మొదటి సారి గుండె శస్త్రచికిత్స చేయించుకున్నడని ఆఒర్టిక్ రూట్, వాల్వ్ సమస్యలతో ఆసుపత్రికి చేరాడన్నారు. పరిస్థితి విషమంగా ఉండటంతో రీడో బెంటాల్ సర్జరీ అవసరమైందన్నారు. ఇటువంటి శస్త్రచికిత్సలు అధిక రక్తస్రావం వంటి కారణాలతో ప్రమాదకరంగా ఉంటాయని డాక్టర్ సుధీర్ తెలిపారు.

డాక్టర్ సుధీర్, ఇతర నిపుణుల బృందం సమగ్ర ప్రణాళికతో 14 గంటల పైగా శస్త్రచికిత్స విజయవంతంగా చేశామని, రోగి పూర్తిగా కోలుకుని సాధారణ జీవితాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. రీడో బెంటాల్ శస్త్రచికిత్సలు సవాలుతో కూడుకున్నవని, ప్రణాళిక, నైపుణ్యం, బృంద సమన్వయం ఉంటే మంచి ఫలితాలు సాధ్యమవుతాయన్నారు.

యశోద హాస్పిటల్స్ సికింద్రాబాద్ యూనిట్ క్లిష్టమైన గుండె శస్త్రచికిత్సల్లో ప్రత్యేక నైపుణ్యం, ఉన్నత ప్రమాణాలతో వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు అందుబాటులో కార్డియాక్ వైద్య సేవలు అందించేందుకు ప్రతి నెల వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక కార్డియాక్ సర్జరీ ఓపిడీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి నెల మొదటి శనివారం జంగారెడ్డిగూడెం, రెండవ శనివారం తణుకు, నాలుగో శనివారం రాజమండ్రిలో ఓపిడీలు నిర్వహించనున్నామని ఉభయగోదావరి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ సమావేశం లో ఆంధ్రప్రదేశ్ మార్కెటింగ్ మేనేజర్ నల్లం బాల వీరభద్ర, ఎక్సిక్యూటివ్ రాఘవ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి శిక్షణ కార్యక్రమం



**జీలుగుమిల్లి, పెన్ పవర్, మార్చి 28;** మండలంలో ప్రా శిక్షణ కార్యక్రమాన్ని ఏప్రిల్ 2, 3 తేదీల్లో నిర్వహించబడును అని బిజెపి సీనియర్ నాయకులు చాట్రాతి ప్రసాద్ తెలిపారు. శనివారం జీలుగుమిల్లిలో చాట్రాతి ప్రసాదు ఇంటి వద్ద బిజెపి మండల సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమం నిర్వహించుకోవడానికి మండల కమిటీ తీర్మానించింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రా శిక్షణ కార్యక్రమం ఇన్చార్జి కొప్పాక శ్రీనివాసరావు, బిజెపి మండల అధ్యక్షులు గుడ్ల రాంబాబు, బిజెపి జిల్లా ఎగ్జిక్యూటివ్ నెంబర్ కొండపల్లి ప్రసాదు, బిజెపి మండల వైస్ ప్రెసిడెంట్ భీమిరెడ్డి సత్య వరప్రసాద్ రెడ్డి, మండల కార్యదర్శి పుల్లగుం సుబ్బారెడ్డి, వీరంకి బాలు, గడ్డం రామకృష్ణ, ఊక సూరి చంద్రం, మండల సోషల్ మీడియా సభ్యులు కక్కిరాల మురళీధర్, కేతిరెడ్డి నెహ్రూ రెడ్డి, సోమిరెడ్డి ,కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


# అన్‌స్టాపబుల్ అమరావతి - శాసనసభలో సరికొత్త చరిత్ర!

**హైదరాబాద్ పెన్ పవర్:** అమరావతి మాత్రమే ఏపీకి రాజధానిగా ఉంటుందని స్పష్టం చేస్తూ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. రాజధానిగా అమరావతికి చట్టబద్దత కల్పించాలని కేంద్రాన్ని కోరుతూ శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని శాసనసభ ఏకగ్రీవంగా అమోదించిందని ప్రభుత్వం ప్రకటించింది. విభజన చట్టం సెక్షన్-5(2)ను సవరించాలని కోరుతూ 'ఎట్ అమరావతి' అనే పదాన్ని చేర్చాలని కోరుతూ అసెంబ్లీ తీర్మానం చేసింది.ఏపీ చరిత్రలో నవ చరిత్రకు రాజధాని అమరావతికి భద్రత, భరోసా ఇచ్చేందుకు శనివారం సమావేశమైన శాసనసభ తీర్మానం చేసింది. రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్డీఏ) నోటిఫై చేసిన ప్రాంతాలను కూడా రాజధాని పరిధిలో తీసుకువచ్చేలా చట్ట సవరణ చేయాలని కోరుతూ శాసనసభ తీర్మానం చేసింది. సభ్యులు ఏకగ్రీవంగా చేసిన తీర్మానాన్ని కేంద్రానికి పంపాలని ప్రభుత్వం శాసనసభ సెక్రటరీ జనరల్ ను ఆదేశించింది.

అదేవిధంగా అమరావతి రాజధానిగా చట్టబద్దత కల్పించాలని కోరుతూ రాజ్యసభ ఛైర్మన్, లోక్ సభ స్పీకర్ కు అసెంబ్లీ తీర్మానాన్ని పంపుతున్నామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు సభలో ప్రకటించారు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వానికి తెలియజేసేందుకు కేంద్ర హోం మంత్రి కార్యాలయానికి తీర్మానం కాపీని పంపుతున్నామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడించారు. స్పీకర్ సూచనలతో తీర్మానం కాపీలను కేంద్ర హోం కార్యదర్శి, ఏపీ సీఎస్ కు పంపిన అసెంబ్లీ సెక్రటరీ జనరల్ పంపించారు.

ఇక రాజధాని అమరావతికి చట్టబద్ధత కోసం తీర్మానం చేయాలనే ఏకైక అజెండాతో సమావేశమైన శాసనసభ ఐదు గంటలకు పైగా సుదీర్ఘంగా సాగింది. ఎలాంటి విరామం లేకుండా కొనసాగిన సభలో కూటమి ఎమ్మెల్యేలు, మంత్రులు తీవ్ర భావోద్వేగంతో ఆవేశంగా ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్ అమరావతిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వంలో అమరావతి అంశమై చోటుచేసుకున్న అనేక ఘటనలను సభలో ప్రస్తావించారు.

నేటి తీర్మానంతో రాజధాని రైతుల రుణం తీర్చుకుంటున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇక అధికారికంగా ఎలాంటి అవాంతరాలు లేకుండా అమరావతి రాజధానిగా కొనసాగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.




03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


## అమరావతిపై తీర్మానం.. వైసీపీపై స్పీకర్ అయ్యన్నసంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ శాసనసభలో రాజధాని అమరావతిపై చారిత్రాత్మక తీర్మానాన్ని ప్రవేశపెట్టే ముందు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అత్యంత కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ తీర్మానం ఐదున్నర కోట్ల మంది ఆంధ్రుల ఆకాంక్షలకు ప్రతిరూపమని స్పీకర్ అయ్యన్న అభివర్ణించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంలో చోటుచేసుకున్న అనేక అంశాలను ఎండగట్టేలా స్పీకర్ విమర్శలు గుప్పించారు. కనీసం ఈ రోజైనా ఆ 11 మంది సభకు హాజరు అవుతానని ఆశించానని వ్యాఖ్యానించారు. సభకు హాజరుకాని విపక్ష వైసీపీ సభ్యులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రగతికి ఎదురయ్యే సవాళ్లను శాశ్వతంగా తొలగించేలా అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టడాన్ని ఒక పవిత్ర యజ్ఞంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు అభివర్ణంచారు. ఈ చారిత్రాత్మక సందర్భంలో తాను భాగస్వామి కావడం అదృష్టంగా భావిస్తున్నట్లు వ్యాఖ్యానించారు. 2014లో విడిపోయిన రాష్ట్రాన్ని గట్టెక్కించే బాధ్యతను ప్రజలు ముఖ్యమంత్రి చంద్రబాబుకు అప్పగించారని, ఆయన తన అపార అనుభవంతో అందరినీ సంప్రదించి, రాష్ట్రానికి కేంద్ర బిందువుగా ఉన్న అమరావతిని రాజధానిగా ఎంపిక చేశారని గుర్తుచేశారు. చంద్రబాబు నిర్ణయంపై నమ్మకంతో అమరావతి రైతులు తమ భూములను స్వచ్ఛందంగా ఇచ్చి సహకరించారని, 2014-19 మధ్య పనులు శరవేగంగా జరిగాయని చెప్పారు.దురదృష్టవశాత్తూ 2019లో ప్రగతి రథానికి అడ్డంకులు ఎదురయ్యాయని, 2019-24 మధ్య కనివినీ ఎరుగని రీతిలో వైపరీత్యాలతో కూడిన పాలన సాగిందని స్పీకర్ మండిపడ్డారు.ఇదే సందర్భంలో సభకు గైర్హాజరైన 11 మంది వైసీపీ సభ్యుల వైఖరిని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తప్పుబట్టారు. "కనీసం ఈ రోజైనా ఆ 11 మంది సభ్యులు సభకు వస్తారని భావించాను. అమరావతి తీర్మానాన్ని బలపరిచి, గతంలో తాము చేసిన తప్పులపై పశ్చాత్తాపం చెందుతారని ఆశించాను. కానీ చేసిన తప్పులను ధైర్యంగా ఒప్పుకునే నిజాయితీ వారికి లేదని అర్థమైంది. ఇది వారి విజ్ఞతకే వదిలేస్తున్నాను." అంటూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు వైసీపీ ఎమ్మెల్యేలపై మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు మారడం సహజమని, కానీ పరిపాలన అనేది నిరంతర ప్రక్రియ అని స్పీకర్ అయ్యన్నపాత్రుడు హితవు పలికారు. ప్రభుత్వాలు మారినప్పుడు పాత పనులు కొనసాగిస్తూ కొత్తవి చేపట్టాలని, కానీ గత పాలకులు తమ చేతికి కొబ్బరి కాయ దొరికినట్టుగా ఇష్టానుసారం వ్యవహరించారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర విధ్వంసానికి కంకణం కట్టుకోవడం వల్ల ఏపీ అభివృద్ధిలో 50 ఏళ్లు వెనక్కి వెళ్లిందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆవేదన వ్యక్తం చేశారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులు వీధినపడి అవమానాల పాలయ్యారని గుర్తుచేశారు.

**శిలాక్షరాల్లో నిలిచిపోయేలా 'అమరావతి'**

ఇలాంటి వినాశకర పరిస్థితులు మళ్లీ రాకూడదనే ఉద్దేశంతోనే, అమరావతిని శాశ్వత రాజధానిగా శిలాక్షరాల్లో లిఖించాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయించిందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు దృఢ సంకల్పం వల్లే కేంద్ర ప్రభుత్వం సైతం రాష్ట్ర విభజన చట్టంలో మార్పులు తెచ్చేందుకు అంగీకరించిందని వెల్లడించారు. ఈ తీర్మానం రాష్ట్ర అభివృద్ధి పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని స్పీకర్ అయ్యన్నపాత్రుడు కొనియాడారు.

## అమరావతిపై షర్మిల ట్వీట్.. 'మళ్లీ జగన్ లాంటి వాళ్లు వస్తే..?'

**హైదరాబాద్ పెన్ పవర్:** రాజధానిగా అమరావతి చట్టబద్ధతను పటిష్టం చేసే దిశగా అసెంబ్లీలో తీర్మానం చేయడంపై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పందించారు. అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టాలనే కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూనే, విభజన చట్టంలోని కీలక హామీలను కేంద్రం నుంచి రాబట్టడంలో ప్రభుత్వం విఫమలవుతోందని విమర్శనాస్త్రాలు సంధించారు. కేంద్రం ఇచ్చేది 'ముష్టి' కాదు.. అది ఏపీ ప్రజల 'హక్కు' అంటూ షర్మిల తన ట్వీట్ లో పేర్కొన్నారు. ఇక తన సోదరుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ పై షర్మిల వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపును కొనియాడుతూనే 'మళ్లీ జగన్ లాంటి వాళ్లు వస్తే' అంటూ షర్మిల వ్యాఖ్యానించడం రాజకీయంగా హీట్ పుట్టిస్తోంది. రాజధాని మార్పు వంటి నిర్ణయాలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా సెక్షన్ 5 సవరణకు కేంద్రాన్ని కోరడం మంచి పరిణామమని షర్మిల తన ట్వీట్ లో అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగానే 'మళ్లీ ఏ జగన్ వంటి వారు వస్తే రాజధాని పరిస్థితి ఏంటన్న ముందుచూపు ఉండటం మీ విజన్ అనుకుందాం.. కానీ కేవలం గెజిట్‌లో పేరు మార్పుతోనే అమరావతి నిర్మాణం పూర్తవుతుందా?" అని ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ప్రశ్నించారు. ప్రధానంగా 2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని అంశాలను ప్రస్తావిస్తూ ఆమె ఘాటైన ప్రశ్నలు వేశారు. కొత్త రాజధానిలో రాజ్‌భవన్, హైకోర్టు, సచివాలయం, అసెంబ్లీ వంటి రాజ్యాంగబద్ధమైన భవనాల నిర్మాణానికి కేంద్రమే పూర్తి నిధులు ఇవ్వాలని సెక్షన్ 94(3) స్పష్టం చేస్తోంది. దీనిపై అసెంబ్లీలో తీర్మానం ఎందుకు చేయడం లేదు? అంటూ షర్మిల తన ట్వీట్ లో నిలదీశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే అరకొర నిధులతో సరిపెట్టుకుందామా? లక్ష కోట్ల రూపాయల భారాన్ని ప్రజల నెత్తిపై వేస్తారా? అని ఆమె నిలదీశారు. గతంలో ప్రధాని మోదీ రాజధాని శంకుస్థాపన సమయంలో ఇచ్చిన 'చెంబుడు నీళ్లు, తట్టెడు మట్టి'నే గొప్ప ప్రసాదంగా భావిద్దామా అని షర్మిల ఎద్దేవా చేశారు.

**గెజిట్ పత్రాల సాక్షిగా.. కేంద్రానిదే బాధ్యత**

విభజన చట్టం గెజిట్ (నెం. 6, మార్చి 1, 2014) ప్రకారం, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బాధ్యత కేంద్రానిదే. ముఖ్యంగా సెక్షన్ 94(3) కింద ఆర్థిక సహాయం అందించడం కేంద్రం చట్టబద్ధమైన బాధ్యత అంటూ షర్మిల వ్యాఖ్యానించారు. అమరావతిని కేవలం కాగితాల మీద రాజధానిగా స్థిరీకరించడం కంటే, కేంద్రం నుంచి రావాల్సిన నిధులను హక్కుగా సాధించుకోవడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని షర్మిల డిమాండ్ చేశారు. కేంద్రం విభజన చట్టానికి తూట్లు పొడుస్తుంటే అసెంబ్లీ వేదికగా ఎందుకు మౌనంగా ఉంటున్నారని, అప్పులు ఇప్పిస్తే చాలని రాజీ పడటం రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతమని ఆమె హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ తరపున తాము సంధిస్తున్న ఈ ప్రశ్నలకు కూటమి ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా సమాధానం చెప్పాలని షర్మిల డిమాండ్ చేశారు.

## అమరావతిపై జగన్ మౌనం.. వ్యూహాత్మిక తప్పిదమా?

**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ రాజకీయాలను 'రాజధాని' సెంట్రిక్ పాలిటిక్స్ హీటెక్కిస్తున్నాయి. అమరావతికి చట్టబద్ధత కల్పించే కీలక తీర్మానం కోసం అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశమైన వేళ ప్రతిపక్షం వైసీపీ గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. గతంలో మూడు రాజధానులను ప్రతిపాదించిన వైసీపీ ఇప్పుడు అమరావతికి వ్యతిరేకం కాదని చెప్పడంలో గందరగోళం ఎదుర్కొంటోందా? అన్న చర్చకు కేంద్ర బిందువుగా మారింది. ప్రత్యేక సందర్భంలో విపక్ష నేత జగన్ తోపాటు మిగిలిన ఎమ్మెల్యేలు పత్తా లేకుండా పోయారని అధికారపక్షం విమర్శలు గుప్పిస్తోంది. రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే అమరావతి తీర్మానంపై చర్చ జరుగుతుంటే, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డితో సహా ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఎవరూ సభలో కనిపించకపోవడాన్ని స్పీకర్ అయ్యన్నపాత్రుడు దగ్గర నుంచి కూటమి ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నారు. రాజధానిపై వైసీపీకి చిత్తశుద్ధి లేదని ఈ రోజు మరోసారి స్పష్టమైందని విమర్శిస్తున్నారు. సాధారణంగా ఇలాంటి కీలక అంశాలపై ప్రతిపక్షం తన వాదనను బలంగా వినిపించాల్సి ఉంటుందని అంటున్నారు. కానీ, సభకు రాకపోవడం ద్వారా వైసీపీ తన వైఖరిని స్పష్టం చేయడంలో వెనకబడిందని వ్యాఖ్యానిస్తున్నారు.



**సజ్జల క్లారిటీ.. జగన్ మౌనం!**

"మేము అమరావతికి వ్యతిరేకం కాదు" అని వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి పలు సందర్భాల్లో స్పష్టం చేశారు. అయితే అదే పార్టీ స్టాండ్ అయినప్పుడు, నేరుగా అసెంబ్లీలో తీర్మానానికి మద్దతు తెలపడమో లేదా తమ అభ్యంతరాలను చెప్పడమో చేస్తే వైసీపీ రాజకీయంగా సరైన వ్యూహం అనుసరించినట్లు అయ్యేదని అంటున్నారు. కానీ, సభకు గైర్హాజరు కావడమే విమర్శలకు తావిస్తోందని అంటున్నారు. కనీసం జగన్ మీడియా ముందుకు వచ్చి తన అంతరంగాన్ని బయటపెట్టినా బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోందని అంటున్నారు.

**జగన్ మదిలో ఏముంది?**

ప్రస్తుత పరిణామాలను చూస్తుంటే కొన్ని కీలక ప్రశ్నలు తలెత్తుతున్నాయని చెబుతున్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఇప్పటికీ మూడు రాజధానుల వైఖరికే మొగ్గు చూపుతున్నారా? అన్న ప్రశ్నకు ఆస్కారమిస్తున్నారని అంటున్నారు. వైసీపీ అసెంబ్లీకి హాజరుకాకపోవడంతో అమరావతికి చట్టబద్ధత కల్పించే క్రెడిట్ మొత్తం కూటమి ప్రభుత్వానికి దక్కిందని వ్యాఖ్యానిస్తున్నారు. అసెంబ్లీకి రాకుండా వైసీపీ మౌనంగా ఉండటం వల్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్లే అవకాశం ఉందని పార్టీ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## మంత్రి అచ్చెన్నాయుడు పవర్ ఫుల్ స్పీచ్.. రికార్డుల నుంచి తొలగించిన స్పీకర్



**హైదరాబాద్ పెన్ పవర్:** అసెంబ్లీలో అమరావతిపై తీర్మానం ప్రవేశపెట్టిన సందర్భంగా జరుగుతున్న చర్చ ఆసక్తికరంగా సాగుతోంది. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సభ టీ, కాఫీ బ్రేకులు లేకుండా, భోజన విరామం కూడా ఇవ్వకుండా నిరాంటకంగా కొనసాగుతోంది. సభలో తీర్మానానికి మద్దతుగా మాట్లాడిన ఎమ్మెల్యేలు, మంత్రులు గత ప్రభుత్వంలో అమరావతిపై అనుసరించిన విధానాన్ని తీవ్రంగా దుయ్యబట్టారు. ఈ సందర్భంగా సీనియర్ నేత, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆవేశంగా మాట్లాడారు. మంత్రి ప్రసంగంలో రెండు అన్ పార్లమెంట్ పదాలను వాడారని, వాటిని రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. అమరావతిపై తీర్మానాన్ని సమర్థిస్తూ మంత్రి అచ్చెన్నాయుడు బలమైన వాదన వినిపించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై మంత్రి నిప్పులు చెరిగారు. అప్పట్లో తాము ప్రతిపక్ష స్థానంలో ఉన్నామని, అప్పుడు అధికార పక్షంలో ఉన్న వైసీపీ సభ్యులు అనుచిత వ్యాఖ్యలు చేస్తూ తమ వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీలో అనరాని మాటలు ఆడారని, వారి తిట్లు విని ఎందుకు రాజకీయాల్లో కొనసాగుతున్నామని బాధపడ్డామని అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. కోడి పిల్లలను మార్చినట్లు మొదటి నుంచి ఏపీ రాజధానులు మారుతూ వచ్చాయని అచ్చెన్నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. 1953లో కర్నూలు, 1956లో హైదరాబాద్ రాజధానులుగా చేశారని, 2014లో మనకు ఇష్టం లేకపోయినా ఏపీని మళ్లీ విడగొట్టారని అచ్చెన్నాయుడు గతాన్ని గుర్తు చేశారు. ఈ సమయంలో 2019లో వైసీపీ ప్రభుత్వం కొలువుదీరడాన్ని అచ్చెన్నాయుడు తీవ్రంగా ఆక్షేపించారు. 2024 వరకు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ వినియోగించుకోడానికి అవకాశం ఉన్నప్పటికీ మన నేలపై నుంచే పాలన సాగాలని రాజధానిగా అమరావతిని ఎంపిక చేశామని అన్నారు. ఇక 2019లో ఎన్నికలు వచ్చాయని, ఆ సమయంలో ప్రజలు చాలా తప్పు చేశారని అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని, పార్టీకి సంబంధం లేదని చెబుతూ ప్రజలు 2019లో వైసీపీని గెలిపించి తప్పు చేశారని మంత్రి అన్నారు. 2019లో రెండోసారి తెలుగుదేశం పార్టీని గెలిపిస్తే మనకు ఈ బాధలు ఉండవని, ఇప్పటికే అమరావతి పూర్తయ్యేదని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటుములు సహజమని, కానీ వైసీపీ గెలవడమే తనలాంటి వారిని తీవ్రంగా బాధించిందని అచ్చెన్నాయుడు అన్నారు.2014-19లో రాష్ట్రం స్వర్ణయుగంలో నడిచిందని, కానీ ప్రజలు ఎందుకు ఓడించారా? అని బాధపడినట్లు తెలిపారు. కానీ, తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని, లక్ష కోట్లు దోచుకుని 16 నెలలు జైలులో ఉన్నవారికి ఓటేశారని అచ్చెన్నాయుడు అన్నారు. ఈ సమయంలో అచ్చెన్న సహనం కోల్పోయే దుర్మార్గులు అంటూ వైసీపీ నేతలను ఉద్దేశించి వ్యాఖ్యానించడం గమనార్హం. ఇక ఇదే క్రమంలో ఆవేశంగా మాట్లాడిన అచ్చెన్నాయుడు గత ప్రభుత్వంలో వైసీపీ నేతల తిట్లు భరించలేకపోయామని వాపోయారు. దుర్మార్గులు రాష్ట్రాన్ని నాశనం చేశారంటూ ధ్వజమెత్తారు. ఒకసారి తాము ప్రతిపక్షంలో ఉండగా రాజధాని అమరావతిపై స్వల్ప కాలిక చర్చ నిర్వహించారని, మొత్తం 151 మంది ఎమ్మెల్యేలతో మాట్లాడించారని, ఒక్కరు కూడా మంచి మాట్లాడలేదని అన్నారు.ఏ ఒక్కరూ అమరావతిని ముందుకు తీసుకువెళదామని చెప్పలేదని, తమను తిట్టడం, అవినీతి ఆరోపణలు చేయడం తప్ప అమరావతి కోసం ఎవరూ మాట్లాడలేదని అచ్చెన్నాయుడు గుర్తు చేశారు. ఈ సందర్భంలో తమను సస్పెండ్ చేసి బయటకు పంపారని, ఆ తర్వాత మూడు రాజధానుల బిల్లు ప్రవేశపెట్టారని అచ్చెన్నాయుడు తెలిపారు. ఇక ఆ తర్వాత తమను అసెంబ్లీలో ఎన్నో రకాలుగా అవమానించారని, తాము సభకు వెళ్లమని చెప్పినా చంద్రబాబు ఒప్పుకోలేదన్నారు. ఇదే సమయంలో శాసనమండలిలో లైట్లు ఆపేసి రాజధానిపై చర్చ నిర్వహించారని, ఆ పెద్దల సభలో చూస్తే అనరాని మాటలు అన్నారని అచ్చెన్నాయుడు తెలిపారు. ఆ మాటలు వింటే గన్ పట్టుకుని కాల్చేయాలని అనిపించిందని మంత్రి వ్యాఖ్యానించారు. కాగా, మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతున్నంత సేపు ఎమ్మెల్యేలు చప్పట్లతో హోరెత్తించారు. అచ్చెన్నాయుడు సుదీర్ఘ ప్రసంగం అనంతరం స్పీకర్ మాట్లాడుతూ, అచ్చెన్నాయుడు ఆవేశంలో ఒకటి రెండు అశబ్దాలు మాట్లాడారని వాటిని రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు.

పెన్ పవర్

ఆదివారం 29 మార్చి 2026

# ముంబై ఇండియన్స్‌కు బిగ్ షాక్.. కేకేఆర్‌తో మ్యాచ్‌కి స్టార్ ప్లేయర్స్ ఔట్!






**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్ ఆరంభంలోనే ముంబై ఇండియన్స్ జట్టుకి బిగ్ షాక్ తగిలింది. రేపు (2026, మార్చి 29న) కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుతో జరగనున్న తొలి పోరుకి ముందు ముగ్గురు కీలక ఆటగాళ్లు అందుబాటులో ఉండకపోవచ్చని తెలుస్తోంది. వాంఖెడేలో సీజన్‌ను ఘనంగా ప్రారంభించాలనుకుంటున్న ముంబైకి, ఈ కీలక ఆటగాళ్ల గైర్హాజరీ పెను సవాల్ గా మారింది. బౌలింగ్ అండ్ బ్యాటింగ్ విభాగాల్లో మార్పులు చేసి కేకేఆర్ జట్టును ముంబై ఇండియన్స్ టీమ్ ఎలా ఎదుర్కొంటుందో వేచి చూడాలి. మిచెల్ సాంట్నర్: న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ సాంట్నర్, ఇటీవలే దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్ ముగిసిన తర్వాత అతను ఇంకా జట్టుతో చేరాల్సి ఉంది. మిడిల్ ఓవర్లలో పరుగులు కంట్రోల్ ఇవ్వడంలో అతను కీలక పాత్ర పోషించనున్నాడు. కాగా టీ20 వరల్డ్ కప్‌లో 8 మ్యాచ్‌ల్లో 140 స్ట్రైక్ రేట్‌తో 120 పరుగులు చేయడమే కాకుండా, బంతితోనూ మెప్పించాడు. విల్ జాక్స్: వ్యక్తిగత కారణాల వల్ల ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ విల్ జాక్స్ అందుబాటుపై లేదని తెలుస్తుంది. టీ20 వరల్డ్ కప్‌లో సెమీఫైనల్ వరకు వెళ్లిన ఇంగ్లాండ్ జట్టులో అతను కీలక పాత్ర పోషించాడు. ఇక టీ20 వరల్డ్ కప్ లో ఇంగ్లాండ్ తరపున అద్భుతంగా ఆడి, 9 వికెట్లు తీయడమే కాకుండా 4 సార్లు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డులను గెలుచుకున్నాడు. జస్ప్రీత్ బుమ్రా: వాంఖెడే స్టేడియంలో జరిగిన ప్రాక్టీస్ సెషన్‌కు బుమ్రా కూడా హాజరుకాకపోవడం అభిమానులను ఆందోళనకు గురి చేస్తోంది. దీంతో అతడు రేపటి కేకేఆర్ తో జరిగే మ్యాచ్ ఆడేది అనుమానంగా మారింది.

**ప్రత్యామ్నాయ ప్లేయర్స్ ఎవరు?:**

అల్లా ఘుజన్ఫర్: సాంట్నర్ స్థానంలో ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన ఈ యువ స్పిన్నర్‌ను ఆడించే అవకాశం ఉంది. సాంట్నర్ లాగే ఇతను కూడా బంతితో బ్యాటర్లను నియంత్రణ చేస్తాడు.

షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్ : విల్ జాక్స్ స్థానంలో పవర్ హిట్టింగ్ ఆల్‌రౌండర్ రూథర్‌ఫోర్డ్‌ను లోయర్ మిడిల్ ఆర్డర్‌లో ఉపయోగించుకోవచ్చు. ఇతను గతంలో గుజరాత్ టైటాన్స్ తరపున ఆడాడు.

# ఫస్ట్ మ్యాచ్‌లోనే ఆ హిస్టరీపై కన్నేసిన కోహ్లీ.. జస్ట్ 6,6,6,6,6,6,6,6,6 కొడితే చాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026కు రంగం సిద్ధమైంది. తొలి మ్యాచ్ లో భాగంగా సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టుతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తలపడనుంది. ఈ క్రమంలో ప్రస్తుతం అందరి చూపు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపైనే పడింది. ఈ మ్యాచ్ లో కోహ్లీ ఓ అద్భుతమైన రికార్డ్ సృష్టించే అవకాశం క్లియర్ గా కనిపిస్తుంది. దీంతో విండీస్ దిగ్గజం క్రిస్ గేల్, భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మల సరసన చేరేందుకు కింగ్ సన్నాహాలు రచిస్తున్నాడు.

ఆర్సీబీ స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఐపీఎల్ చరిత్రలోనే మరో అద్భుత రికార్డును సృష్టించేందుకు రెడీ అవుతున్నాడు. ఐపీఎల్ లో 300 సిక్సర్ల మార్కును చేరుకునేందుకి విరాట్ మరో 9 సిక్సర్లు మాత్రమే కొట్టాల్సిన అవసరం ఉంది. ఇప్పటి వరకు ఆడిన 267 మ్యాచ్‌లలో కోహ్లీ మొత్తం 291 సిక్సులు కొట్టాడు. ఒకవేళ సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగే తొలి మ్యాచ్‌లోనే అతడు ఈ ఘనత సాధిస్తే, ఐపీఎల్‌లో 300 సిక్సర్లు కొట్టిన థర్డ్ బ్యాటర్‌గా చరిత్రలోకి ఎక్కుతాడు.

ప్రస్తుతం ఐపీఎల్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన ప్లేయర్స్ లిస్టులో వెస్టిండీస్ విధ్వంసకర వీరుడు క్రిస్ గేల్ తొలిస్థానంలో ఉన్నారు. గేల్ కేవలం 142 మ్యాచ్‌లలోనే 357 సిక్సులు కొట్టి ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచాడు. ఇక టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ 2025 సీజన్‌లోనే ఈ 300 సిక్సర్ల మైలురాయిని అందుకున్నాడు. రోహిత్ ప్రస్తుతం 272 మ్యాచ్‌లలో 302 సిక్సర్లతో సెకండ్ ప్లేస్ లో కొనసాగుతున్నాడు. ఇప్పుడు వీరిద్దరి సరసన చేరే ఛాన్స్ విరాట్ కోహ్లీకి ఉంది. ఐపీఎల్ ఫస్ట్ మ్యాచ్ బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియంలో జరగబోతుంది. కోహ్లీకి ఇది సొంత మైదానం కావడంతో.. ఈ పిచ్ బ్యాటింగ్‌కు స్వర్గధామం, దీంతో కోహ్లీ బ్యాట్ నుంచి పరుగుల వరద పారే ఛాన్స్ కనిపిస్తుంది. ఇప్పటికే ఐపీఎల్ చరిత్రలో అత్యధిక రన్స్ చేసిన ఆటగాడిగా కోహ్లీ చరిత్ర సృష్టించాడు. అతడు 39.54 సగటుతో మొత్తం 8661 రన్స్ సాధించాడు. ఇందులో 8 సెంచరీలు, 63 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. కాగా 2026 మెగా వేలానికి ముందే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీ కోహ్లీని రూ. 21 కోట్లకు రిటైన్ చేసుకుంది. గత సీజన్లలో అద్భుత ప్రదర్శన చేసిన విరాట్, ఈసారి కూడా అదే జోరును కొనసాగించాలని ఆర్సీబీ ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ఈరోజు జరగబోయే కీలక పోరులో కోహ్లీ 300 సిక్సర్ల మార్కును అందుకుంటాడో లేదో చూడాలి.

# మధ్య హోరాహోరీ పోరు.. టాస్ టైమింగ్, మ్యాచ్ ప్రిడిక్షన్ ఇదే!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ ఎడిషన్ ఈరోజు ఘనంగా ప్రారంభం కాబోతుంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా తొలి మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వర్సెస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు తలపడనున్నాయి. గత సీజన్‌లో తొలిసారి టైటిల్ గెలిచిన ఆర్సీబీ ఈసారి వరుసగా రెండో టైటిల్ సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. మరోవైపు గత సీజన్‌లో ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించలేకపోయిన సన్‌రైజర్స్ ఈసారి బలంగా పునరాగమనం చేయాలని చూస్తోంది.

**ఆర్సీబీ బలాలు:**

రజత్ పాటిదార్ నాయకత్వంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు బరిలోకి దిగబోతుంది. మ్యాచ్ ప్రారంభానికి ముందు జట్టులోని కీలక ఆటగాళ్లు గాయాల సమస్యలు ఎదుర్కొంటున్నారు. పేస్ బౌలర్లు జోష్ హేజిల్‌వుడ్, నువాన్ తుషార తొలి మ్యాచ్‌కు అందుబాటులో లేరు. అలాగే యశ్ దయాల్ మొత్తం సీజన్‌కు దూరమయ్యాడు. దీంతో బౌలింగ్ బాధ్యతలు భువనేశ్వర్ కుమార్, జాకబ్ డఫీ, మంగేష్ యాదవ్, రసిక్ సలామ్ మోయనున్నారు. బ్యాటింగ్ విభాగంలో విరాట్ కోహ్లీ, ఫిల్ సాల్ట్, దేవదత్ పడిక్కల్, టిమ్ డేవిడ్ లాంటి ఆటగాళ్లు కీలకం కానున్నారు. వికెట్ కీపింగ్ బాధ్యతలను జితేష్ శర్మ నిర్వహించనున్నాడు. అలాగే రొమారియో షెపర్డ్, కృనాల్ పాండ్యా వంటి ఆల్‌రౌండర్లు చివరి ఓవర్లలో వేగంగా పరుగులు సాధించగల సామర్థ్యం కలిగి ఉన్నారు.

**సన్‌రైజర్స్ బలాలు:**

సన్‌రైజర్స్ హైదరాబాద్ విషయానికి వస్తే.. జట్టు ప్రధాన ఆటగాడు ప్యాట్ కమిన్స్ తొలి కొన్ని మ్యాచ్‌లకు దూరమయ్యాడు. దీంతో ఇషాన్ కిషన్ తాత్కాలిక నాయకత్వ బాధ్యతలు చేపట్టనున్నాడు. బ్యాటింగ్‌లో

అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, హైన్రిచ్ క్లాసెన్ వంటి ఆటగాళ్లు టాప్ ఆర్డర్‌ను బలంగా నిలబెడతారు. మిడిల్ లో నితీష్ కుమార్ రెడ్డి, లియామ్ లివింగ్‌స్టోన్ లాంటి ప్లేయర్స్ జట్టుకు అదనపు బలంగా మారనున్నారు. ఇక బౌలింగ్ విభాగంలో హర్షల్ పటేల్, జయదేవ్ ఉనద్కత్, బ్రైడన్ కార్స్ ఉన్నప్పటికీ, ప్యాట్ కమిన్స్ లేకపోవడం జట్టు కొంత బలహీనంగా కనిపిస్తుంది.

**ఈ మ్యాచ్ సాయంత్రం 7: 30 నిమిషాలకు ప్రారంభం కానుంది. టాస్ సాయంత్రం 7 గంటలకి పడనుంది.**

**ఈ మ్యాచ్ ఎక్కడ జరుగుతుంది?:**

ఆర్సీబీ వర్సెస్ ఎస్ఆర్‌హెచ్ మధ్య మ్యాచ్ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరుగుతుంది.

**ఎవరు గెలుస్తారు?:**

బెంగళూరులో ఎస్ఆర్‌హెచ్‌పై గెలవడానికి ఆర్సీబీ హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది. హోమ్ గ్రౌండ్ ప్రయోజనం, బలమైన బ్యాటింగ్ లైనప్, ప్రస్తుత ఛాంపియన్‌గా ఉన్న ఆత్మవిశ్వాసం కారణంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు ఈ మ్యాచ్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. అయితే, SRH బ్యాటింగ్ లైనప్ గనుక క్లిక్ అయితే చిన్నస్వామి స్టేడియంలో పరుగుల వరద పారడం ఖాయం.

# దిశా పటానీ అందాలకు సోషల్ మీడియాలో క్రేజ్.. ఫ్యాన్స్ ఫిదా

బాలీవుడ్ హాట్ బ్యూటీ దిశా పటానీ తన గ్లామరస్ లుక్స్‌తో ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. తెలుగులో 'లోఫర్' సినిమాతో ఎంట్రీ ఇచ్చి, రీసెంట్‌గా 'కల్కి 2898-ఏడీ'లో ప్రభాస్ సరసన మెరిసిన ఈ భామ, అటు సినిమాలతోనూ ఇటు హాట్ ఫోటోషూట్‌లతోనూ ఎప్పుడూ వార్తల్లో నిలుస్తోంది. తాజాగా దిశా పోస్ట్ చేసిన మైండ్ బ్లాక్ అయ్యే పిక్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. ఆమె అందచందాలకు నెటిజన్లు ఫిదా అవుతూ లైకులు, కామెంట్లతో హోరెత్తిస్తున్నారు. ఆ విశేషాలు చూద్దాం ..

**టాలీవుడ్ ఎంట్రీ నుండి పాన్ ఇండియా స్టార్ వరకు :**




**వైష్ణవి చైతన్య టైమ్‌లెస్ ఎత్నిక్ లుక్‌లో గాంభీర్యాన్ని పునర్నిర్వచించింది**

వరుణ్ తేజ్ నటించిన 'లోఫర్' సినిమాతో దిశా పటానీ తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. మొదటి సినిమాతోనే తన క్యూట్ అండ్ హాట్ లుక్స్‌తో కుర్రాళ్ల మనసు దోచుకుంది. ఆ తర్వాత బాలీవుడ్‌లో వరుస అవకాశాలు అందుకుంటూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. ఇక పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ సరసన 'కల్కి 2898-ఏడీ'లో నటించి మరోసారి టాలీవుడ్ వెండితెరపై మెరిసింది. ఇక సూర్య కంగువ మూవీ లో నటించి మెప్పించింది. ఇక గ్లోబల్ లెవల్ ప్రాజెక్టుల్లో భాగమవుతూ తన క్రేజ్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తోంది.

**సోషల్ మీడియాలో గ్లామర్ విందు:**

దిశా పటానీకి సోషల్ మీడియాలో ఉన్న ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. ఎప్పటికప్పుడు తన ఫిట్‌నెస్ వీడియోలను, గ్లామరస్ ఫోటోలను షేర్ చేస్తూ ఫ్యాన్స్‌ను ఖుషీ చేస్తూ ఉంటుంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోల్లో మెరిసే డ్రెస్ వేసుకుని, తన ఎద అందాలతో కుర్రాళ్లకు మెంటలెక్కించేలా స్టిల్స్ ఇచ్చింది. ఈ ఫోటోలు చూసిన వారెవరైనా దిశా అందానికి దాసోహం అనాల్సిందే. నెట్టింట మంటలు పుట్టించడంలో ఈమె రూటే సెపరేట్ అని నెటిజన్లు



కామెంట్స్ చేస్తున్నారు.

**బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్.. స్పెషల్ షోలతో బిజీ:**

కేవలం సినిమాలే కాకుండా, దిశా పటానీ టాప్ బ్రాండ్లకు అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ కోట్లు గడిస్తోంది. ఫిట్‌నెస్ ఫ్రీక్ కావడంతో స్పోర్ట్స్ వేర్ మరియు ఫ్యాషన్ బ్రాండ్ల ప్రకటనల్లో ఈమెకు డిమాండ్ ఎక్కువగా ఉంది. అలాగే పలు స్పెషల్ షోలు, ఈవెంట్లలో తన డాన్స్ పర్ఫార్మెన్స్‌తో స్టేజ్‌పై నిప్పులు చెరుగుతుంది. ఇక బాలీవుడ్ టాప్ హీరోల సినిమాల్లో నటిస్తూనే, మరోవైపు గ్లామర్ షోతో తన పాపులారిటీ తగ్గకుండా జాగ్రత్త పడుతోంది. మొత్తానికి దిశా పటానీ అటు వెండితెరపై, ఇటు సోషల్ మీడియాలోనూ తన హవా కొనసాగిస్తోంది. నటనతో పాటు తన పర్ఫెక్ట్ ఫిజిక్‌తో యూత్ ఐకాన్‌గా మారింది. ప్రస్తుతం చేతిలో మరిన్ని క్రేజీ ప్రాజెక్టులు ఉన్న ఈ భామ, రాబోయే రోజుల్లో ఇంకెన్ని రికార్డులు సృష్టిస్తుందో చూడాలి. ఇక ఏదేమైనా దిశా పటానీ అప్‌డేట్ వచ్చిందంటే చాలు, నెటిజన్లు ఆ ఫోటోలపై ఒక లుక్కేయకుండా ఉండలేరు. ఈ బాలీవుడ్ భామ అందాలకు ఫిదా అవ్వని వారుండరంటే అతిశయోక్తి కాదు!



**త్రిధా చౌదరి నీలి రంగులో చక్కదనాన్ని పునర్నిర్వచించింది**

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com